
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం, 1 ఆగస్టు 2025
5



లోపలి పేజీల్లో..
బనకచర్ల పై బీఆర్ఎస్‌ది కపట నాటకం
ఆ పార్టీ నేతల వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ నాయకులు
పొలంలో రైతు హఠాన్మరణం 7
ఆశ్రమ విద్యార్థుల 'పీఎం ట్రిప్'
రెండు మినీ బస్సుల్లో 200 మంది తరలింపుపై చర్చ

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

- సర్కారీ స్కూళ్లు, కాలేజీల్లో ప్రమాణాల పెంపు
- పాలేరులో విద్యాభివృద్ధికి రూ.470కోట్లు ఖర్చు చేశాం
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచిలో జూనియర్ కళాశాలకు శంకుస్థాపన



జూనియర్ కళాశాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విద్యావైద్యానికి ప్రాధాన్యమిస్తోందని, ఈ క్రమంలోనే సర్కారీ బడులు, కాలేజీల్లో విద్యాప్రమాణాల పెంపునకు రూ.కోట్లాది నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం కూసుమంచిలో పర్యటించిన ఆయన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రూ.5.50 కోట్లతో నిర్మించనున్న జూనియర్ కళాశాల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎనిమిదో తరగతి విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ విద్యారంగంలో వెనకబడిన పాలేరు నియోజకవర్గాన్ని విద్యపట్ల అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. గత 20నెలల కాలంలోనే రూ.470 కోట్లు మంజూరు చేశామని, వాటిలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా గురుకులం, రూ.208 కోట్లతో జేఎన్‌టీయూ కళాశాల, రూ.5.50కోట్లతో జూనియర్ కళాశాల, తిరుమలాయపాలెంలో రూ.2.70కోట్లతో హాస్టల్ మంజూరు చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా పిల్లలను భావిపౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గురుకులాల్లో పిల్లలకు నాణ్యమైన భోజనం అందించేందుకు 40శాతం డైట్ చార్జీలు, 200శాతం కాస్మెటిక్ చార్జీలు పెంచామని, పిల్లల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్టు తెలిపారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ చదువుకు మించిన ఆస్తి లేదని, చదువుంటే జీవితంలో గొప్పస్థాయికి ఎదగొచ్చన్నారు. పీఎంశ్రీ కింద పాఠశాలను ఎంపిక చేసి ల్యాబ్ ఏఐ టూల్స్ ద్వారా విద్యాబోధన, ఇతర సౌకర్యాలు కల్పించినట్టు వివరించారు. విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టిపెట్టి నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. మంత్రి పొంగులేటి (మిగతా 6వ పేజీలో)



'వ్యయ'సాయం.. పెట్టు'బడి'

ఏటా వేసవి కాలం ముగిసిన అనంతరం అటు రైతులు.. ఇటు విద్యార్థుల తల్లిదండ్రులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తాల్సిందే. జూన్ నెల వస్తోందంటే చాలు ఓ వైపు వ్యవసాయ పెట్టుబడులకు.. మరో వైపు పిల్లల పుస్తకాలు, యూనిఫాంలు ఇతరత్రా సామగ్రి కొనేందుకు అయ్యే ఖర్చులతో బెంబేలెత్తాల్సిందే. ఎన్ని కష్టాలు ఎదురైనా వ్యవసాయాన్ని.. పిల్లల భవిష్యత్‌ను చూసుకుంటూ తమకు అయ్యే 'వ్యయం' లెక్కించుకుంటూ ఆందోళన చెందాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇలా జూన్, జూలై నెలల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెట్టిన ఖర్చు చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. అటు విద్యాసంవత్సర ప్రారంభం, ఇటు పంటలకు పెట్టుబడి కలిపి కేవలం రెండు నెలల్లో సుమారు రూ.2వేల కోట్ల వరకు ఖర్చు చేయగా.. ఏడాది చివరి నాటికి ఆ ఖర్చు రెండింతలవుతుందనే చెప్పాలి.

- రెండు నెలల్లో.. రెండు రంగాల్లో సుమారు రూ.2వేల కోట్ల ఖర్చు
- పంటలు వేసేందుకు అయిన ఖర్చు రూ.వెయ్యి కోట్ల పైమాటే
- విద్యాసంవత్సరం ప్రారంభానికి రూ.850 కోట్లు
- ఏడాది మొత్తంలో దీనికి రెండింతలు పెట్టాల్సిందే!
- ఏటికేడు భారీగా పెరుగుతున్న వ్యయం
- ఉమ్మడి జిల్లా రైతులు, విద్యార్థుల తల్లిదండ్రులపై భారం

ఖమ్మం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం ముగిసే సమయానికే రైతులు తాము పంటలు వేసుకునేందుకు పనులు ప్రారంభిస్తూ ఉంటారు. గతంలో వేసిన పంటలకు సంబంధించిన చెత్తను తొలగించి వర్షాల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అయితే ఈ ఏడాది జూన్ నెల ప్రారంభంలోనే వర్షాలు పడటంతో సాగు పనులు మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే రెండు నెలల వ్యవధిలో పత్తి విత్తనాలను సైతం నాటారు. కొందరు వరి నాట్లు వేస్తే.. ఇంకొందరు కరివేద పద్ధతిలో పంట వేస్తున్నారు. అయితే కొద్ది రోజుల పాటు వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి సాగు ఆలస్యమైనా.. ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలు, సాగర్ నీటి రాకతో మిగిలిన రైతులు కూడా వరి పంట వేశారు. ఇక మిర్చికి సంబంధించి కొందరు రైతులు విత్తనాలు కొనుగోలు చేసి నర్సరీల్లో పెంచుకుంటుండగా.. మరికొందరు నేరుగా నర్సరీల్లో మొక్కలను ఆర్డర్లు ఇచ్చి సిద్ధంగా ఉన్నారు. వీటన్నింటికి సంబంధించి ఒక్కో ఎకరానికి సంబంధించి లెక్కించినప్పుడు చాలా చిన్న మొత్తంలో అనిపించినప్పటికీ ఉమ్మడి జిల్లాలో వేసిన పంటలను పూర్తిగా లెక్కిస్తే రెండు నెలల్లో రైతులు పెట్టిన ఖర్చు రూ.వెయ్యి కోట్ల పైమాటే మరి. ఇప్పటివరకు పెట్టిన ఖర్చులో అత్యధిక శాతం దుక్కులు, రోటావేటర్లతో పాటు విత్తనాలు వేసేందుకు అవసరమైన అచ్చుకు ఖర్చయినట్టుగా తెలుస్తోంది.

పంటల వారీగా పెట్టిన ఖర్చు ఇలా..

పత్తి పంటకు సంబంధించి రైతు ముందుగా రెండుసార్లు దుక్కులు వేయాల్సి ఉండగా.. దానికి రూ. 3,600, రోటావేటర్ వేస్తే దానికి రూ.2వేలు ఖర్చు అవుతోంది. దానితోపాటు విత్తనాలు వేసేముందు అచ్చు, గొర్రుకు కలిపి రూ.4వేల చొప్పున ఎకరానికి మొత్తం రూ.10వేల వరకు ప్రారంభ ఖర్చు కనిపిస్తోంది. ఇక విత్తనాల విషయానికొస్తే ముందుగా విత్తనాలు వేయడం, ఆ తర్వాత కొన్ని మొలకెత్తని వాటి స్థానంలో కొత్త విత్తనాలు వేయడం వరకు రెండు ప్యాకెట్ల వరకు పడుతుండగా.. విత్తనాల వేసిన కూలీ ఖర్చులతో కలిపి రూ. 2వేల వరకు ఖర్చయింది. ఇలా ఎకరానికి సగటున రూ.12వేల వరకు ఖర్చవగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 4లక్షల ఎకరాలకుగాను రూ.480కోట్లు ఖర్చు చేశారు. దాంతో పాటు మొక్క ఎదిగిన తర్వాత వేసే మందు కట్టల ఖర్చు అదనంగా ఉంటుంది.

- వరికి సంబంధించి ఇటీవల కాలంలో కూలీ ఖర్చులు, శ్రమను తగ్గించుకోవడంలో భాగంగా అత్యధికశాతం రైతులు కరివేద (వెదజల్లే) పద్ధతిలోనే సాగు ప్రారంభిస్తున్నారు. అలా ముందుగా దుక్కి వేస్తే రూ.2వేలు ఖర్చు కానుండగా, నేరుగా దమ్ము చేసినందుకుగాను రూ.2వేలు ఖర్చవుతోంది. దాంతో పాటు విత్తనాల బస్తా రూ.850 వరకు అవగా.. దానితో పాటుగా వేసే మందు కట్టలకుగాను రూ. 2500 వరకు ఖర్చవుతోంది. ఇలా ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో వరి వేయగా, భద్రాద్రి జిల్లాలో 50వేల ఎకరాల్లో పంటను వేశారు. కాగా ఇటీవల వర్షాలు పడిన క్రమంలో మిగిలిన మూడు లక్షల ఎకరాల్లోనూ విత్తనాలు వేస్తున్నారు. ఇలా ఎకరాకు సగటున రూ. 7,500 వరకు ఖర్చు లెక్కిస్తే ఉమ్మడి జిల్లాలో వరి రైతులు పెట్టిన ఖర్చు రూ.330కోట్లకు చేరుతోంది.
- గతేడాది మిర్చి పంటకు ధర పతనం అవడంతో ఈ ఏడాది పంట వేసేందుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. సగానికి పైగా పంటను తగ్గించి వేస్తున్నారు. కాగా మిర్చి పంట వేసేందుకుగాను దుక్కులకు, మందు కట్టలు, సాలు వేసినందుకు (మిగతా 6వ పేజీలో)



డుమ్మా ఉపాధ్యాయులకు చెక్!

- విధులను ఎగ్గొడితే ఇక అంతే సంగతులు
- విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకూ ఎఫ్ఆర్ఎస్
- యాప్‌లో తమ పేర్ల నమోదుకు కుస్తీ
- నేటి నుంచే ముఖ హాజరు విధానం అమలు

కొత్తగూడెం కలెక్టరేట్/బోనకల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు ఇష్టం వచ్చినట్లుగా డుమ్మా కొట్టడంతో పాటు ఆలస్యంగా వచ్చే ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర విద్యాశాఖ ఎఫ్ఆర్ఎస్ ద్వారా చెక్ పెట్టనుంది. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన జిల్లా విద్యాశాఖాధికారుల సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ (మిగతా 6వ పేజీలో)

సమాచార హక్కు చట్టం.. ప్రజల ప్రాథమిక హక్కు

- అధికారులు పౌరులు, ప్రభుత్వానికి జవాబు దారీగా ఉండాలి
- ఆర్టీఐపై అవగాహన సదస్సులో ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, పక్కన కమిషనర్లు భూపాల్, శ్రీనివాసరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం ప్రజల ప్రాథమిక హక్కు అని, ప్రజల హక్కులను కాపాడేందుకు అధికారులు ప్రజలకు, ప్రభుత్వానికి జవాబుదారీతనంగా ఉండాలని సమాచార హక్కుచట్టం ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయంలో సమాచార హక్కుచట్టం (ఆర్టీఐ) అమలు పరిస్థితిని సహ కమిషనర్లు దేశాల భూపాల్, వీవీ. శ్రీనివాస్‌రావులతో కలిసి సమీక్షించారు. ఆ తర్వాత ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్టీఐ యాక్ట్ అమలు చేసే విధానాలపై పౌర సమాచార శాఖ అధికారులు చట్ట నిబంధనలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా బోరెడ్డి అయోధ్యరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీఐ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటిసారి తాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రావడం జరిగిందన్నారు. సమాచార హక్కు చట్టం అవగాహన కోసం ఈ సదస్సును ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు చూపించిన చొరవ హర్షించదగ్గ విషయమన్నారు. 136 దేశాల్లో సమాచార హక్కుచట్టం అమలవుతుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆర్టీఐ సమర్థవంతంగా అమలవుతుందని, సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార శాఖ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, అవినీతి నిర్మూలనే లక్ష్యంగా సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టంలో సెక్షన్లు, సబ్ సెక్షన్లను పౌర సమాచార శాఖ అధికారులు చదివి సమగ్ర అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న 29 ప్రభుత్వ శాఖల్లో.. 15శాఖల్లో ఎలాంటి కేసులు లేకపోవడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ హక్కు చట్టం అమలులో ప్రపంచంలోనే భారతదేశం 8వ స్థానంలో ఉందని, రాబోయే రోజుల్లో మొదటి స్థానానికి రావాలని ఆకాంక్షించారు. అలాగే దేశంలో తెలంగాణ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపే విధంగా కృషి చేస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనం ఎంత అవసరమో పారదర్శకత కూడా అంతే అవసరమన్నారు. ఆర్టీఐ యాక్టు ద్వారా పూర్తి సమాచారం అందించినప్పుడు మాత్రమే జవాబుదారీతనం, పారదర్శకతకు సార్థకత చేకూరుతుందన్నారు. గత పదేళ్ల కాలంలో సమాచార కమిషనర్ అందుబాటులో ఉండకపోవడం వల్ల రాష్ట్రంలో 18వేల కేసులు సమాచార హక్కుచట్టం కమిషనర్ దగ్గర పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆగస్టు నెలలో పెండింగ్‌లో ఉన్న కేసులను పూర్తిగా పరిష్కరించి కొత్త దరఖాస్తుల ద్వారా ముందుకు వెళ్లనున్నట్టు తెలిపారు. రెండు నెలల్లో 30 శాఖల కేసులు పూర్తిగా పరిష్కరించే విధంగా (మిగతా 6వ పేజీలో)

అక్టోబర్ వరకు 122 మెగావాట్లు

సోలార్ ప్లాంట్ల నిర్మాణం పూర్తి కావాలి

- జియో థర్మల్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేయండి
- సింగరేణి వ్యాపార విస్తరణ చర్యల సమీక్షలో సీఎండీ బలరాం



కొత్తగూడెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న 122 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల పనులు వచ్చే అక్టోబర్ నెల వరకు పూర్తి చేయాలని సింగరేణి సంస్థ చైర్మన్ సీఎండీ ఎన్. బలరాం అధికారులను ఆదేశించారు. టెండర్ పనులు ఖరారైన మరో 137 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించి ఏడాది లోగా పూర్తి చేయాలని.. తద్వారా మొత్తం 504 మెగావాట్ల సోలార్ సామర్థ్యాన్ని సాధించాలన్నారు. గురువారం సాయంత్రం సింగరేణి భవన్‌లో ఆయన సింగరేణి చేపట్టిన సోలార్ పవర్, ఇతర వ్యాపార విస్తరణ చర్యలపై సమీక్షించారు. అనంతరం బలరాం మాట్లాడుతూ.. సోలార్ ప్లాంట్ల నిర్మాణంలో అలసత్వాన్ని సహించేది లేదన్నారు. ఈ పనులు నిర్దేశిత సమయం లోపు పూర్తి చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని ఏజెన్సీలతో పాటు పర్యవేక్షక అధికారులను హెచ్చరించారు. సింగరేణి సంస్థ రామగుండంలో చేపట్టనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలపై సానుకూల నివేదిక వచ్చి నేపథ్యంలో.. ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి అన్ని రకాల చర్యలు అతి వేగంగా పూర్తి చేయాలని కోరారు. ఓపెన్‌కాస్టు గనుల డంపులపై పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు త్వరగా అధ్యయనం పూర్తి చేయాలన్నారు. మేడిపల్లి ఓపెన్‌కాస్టు గనితో పాటు ఇతర ఓపెన్‌కాస్టు (మిగతా 6వ పేజీలో)

చేపల వేటకు వెళ్లి ముగ్గురి గల్లంతు

- ఎర్రుపాలెం మండలం మీనవోలు కట్టలేరు వద్ద ఘటన
- గాలింపు చేపట్టిన రెస్క్యూ బృందం



భూక్యా సాయిరాం



బాదావత్ రాజు



భూక్యా కోటేశ్వరరావు

ఎర్రుపాలెం, జూలై31 (ఆంధ్రజ్యోతి): కట్టలేరు నదిలో చేపల వేటకు వెళ్లి ముగ్గురు వ్యక్తులు గల్లంతైన సంఘటన గురువారం ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామంలో జరిగింది. స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రుపాలెం మండలంలోని బంజర గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు భూక్యా చంద్రు, భూక్యా చినకోటి, బానావత్ మహేంద్ర, బాదావత్ పంతులు, హలావత్ రాము, భూక్యా సాయిరాం, బాదావత్ రాజు, భూక్యా కోటేశ్వరరావు మొత్తం (మిగతా 6వ పేజీలో)



రఘునాథపాలెం మండలంలోని 33 చెరువులకు సాగర్ నీటిని ఎత్తిపోస్తున్న మంచుకొండ ఎత్తిపోతల పథకం పంప్

చెరువులు నిండగ.. అలుగుల పండుగ

- రూ.66కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తి
- మత్తడులు పోస్తున్న 33 చెరువులు
- అలుగు నీటికి గిరిజన రైతుల పూజలు

7

అమ్మపాలు అమృతం

- జిల్లా ఆస్పత్రిలో విజయవంతంగా తల్లిపాల సేకరణ
- నీలోఫర్ తర్వాత ఖమ్మం ఆస్పత్రిలోనే మిల్క్‌బ్యాంక్ ఏర్పాటు



తల్లిపాల సేకరణ కేంద్రం

6

గులాబీ సాగు బహుబాగు

లాభాలు గడిస్తున్న రైతు వెంకటేశ్వరరావు

మధిర రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటలు వేసి పెద్దగా కలిసి రాకపోవడంతో పూల సాగువైపు మళ్లి ఓ రైతు గులాబీ పూలు పండిస్తూ రాణిస్తున్నాడు. మధిర మండలం దెందుకూరు గ్రామానికి చెందిన రైతు అమరనేని వెంకటేశ్వరరావు



రెండెకరాల పొలంలో గులాబీ పూల సాగు చేపట్టాడు. గతంలో కొన్ని సంవత్సరాల పాటు వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి సాగుచేసి సరిగా కలిసి రాకపోవడంతో ఆ పంటలకు స్వస్తి పలికి పూల సాగు వైపు మళ్లాడు. అర్కాసభి రకం గులాబీని సాగుచేస్తున్నాడు. ఎకరాకు రెండువేలు మొక్కల చొప్పున నాటాడు. మొక్క రూ.70 చొప్పున కొనుగోలు చేశాడు. మొక్క కొనుగోలు దగ్గరి నుంచి వేసేందుకుగాను ఆ తర్వాత ఎరువులు ఇతరత్రా అన్నీ కలిపి ఎకరాకు రూ.రెండు లక్షలకుపైగా ఖర్చు చేశాడు. 11 నెలల క్రితం ఈ సాగు మొదలుపెట్టాడు. ఈ గులాబీ మొక్క నాటిన ఆరు నెలల నుంచి పూలు పూస్తాయి. ఒక్కసారి మొక్క నాటితే 15 నుంచి 20 ఏళ్లపాటు ఉంటుంది. సంవత్సరానికి ఒక



పూలు కోస్తున్న కూలీలు

పూల సాగు లాభదాయకంగా ఉంది

అమరనేని వెంకటేశ్వరరావు (రైతు, దెందుకూరు)

గతంలో నేను పలు రకాల పంటలను సాగుచేశాను. ఆ పంటల్లో సరైన దిగుబడులు, ఆపై గిట్టుబాటు ధరలు కూడా ఉండేవి కావు. ఆ పంటలకు స్వస్తి పలికి గులాబీ పూల సాగు చేపట్టా. ఈ సాగు నాకు లాభదాయకంగానే ఉంది. గులాబీతో పాటు మరో రెండెకరాల్లో బంతి, చామంతి పూలసాగు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నా.

సారి రెమ్మలు కట్ చేస్తే మళ్లీ ఇగురు వస్తుంది. ఈ రకం గులాబీకి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. మూడురోజులు ఉన్నా.. పూలు వడబడకుండా రెమ్మలు ఊడిపోకుండా ఎంతో నాణ్యతగా ఉంటాయని రైతు వెంకటేశ్వరరావు తెలిపాడు. ప్రస్తుతం కిలో గులాబీ పూలు రూ.200కు అమ్ముతున్నాడు. ప్రతిరోజూ మార్కెట్‌కు పది కిలోలు తీసుకువచ్చి అమ్మడంతోపాటు పొలం వద్దకు వచ్చి కొనుగోలు చేసే వారికి కూడా అక్కడే అమ్ముతుంటాడు. మధిర చుట్టుపక్కల గ్రామాల్లో శుభకార్యక్రమాలకు కూడా ఈ గులాబీ పూలనే ఆర్డర్‌పై సరఫరా చేస్తున్నాడు. గులాబీ పూల సాగు ఆర్థికంగా పర్వాలేదని రైతు వెంకటేశ్వరరావు తెలిపాడు. మొత్తమ్మీద గులాబీ పూల సాగుతో రైతు ముందుకు సాగుతున్నాడు.



తల్లిపాలను సేకరించే తీరును వివరిస్తున్న వైద్య సిబ్బంది

నిల్వ ఉన్న తల్లిపాలు

అమ్మపాలు అమృతం..

- జిల్లా ఆస్పత్రిలో విజయవంతంగా తల్లిపాల సేకరణ
- నీలోఫర్ తర్వాత ఖమ్మం ఆస్పత్రిలోనే మిల్క్‌బ్యాంక్ ఏర్పాటు

ఖమ్మం కలెక్టరేట్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతి శిశువు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో... తల్లిపాలు కొరత ఉన్న శిశువులకు పాలు పట్టించేందుకు వీలుగా జిల్లా జనరల్ ఆస్పత్రిలో మూడేళ్ల క్రితం తల్లిపాల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రి తర్వాత ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో రూ.42 లక్షలతో తల్లిపాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2022 ఏప్రిల్ 30న దీన్ని అప్పటి సర్కారు ప్రారంభించింది. తల్లి పాలు శిశువులకు ఎంతో ప్రధానం. రోగనిరోధక శక్తిని పుట్టినప్పటి నుంచే ఇవ్వాలంటే ఆ తల్లి తప్పని సరిగా పాలు పట్టించాల్సి ఉంటుంది. అయితే దురదుష్టవశాత్తు కొందరు తల్లులు తమ శిశువులకు పాలు పట్టించే పరిస్థితి ఉండడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకు శిశువులకు తల్లిపాలు అందించేందుకు మాతా శిశు కేంద్రం ఆదరవునిస్తోంది. 'మిల్క్ బ్యాంక్' కార్యక్రమంతో పిల్లలకు సురక్షితమైన తల్లిపాలను అందజేస్తోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు తీసిపోని విధంగా అమృతం పేరుతో ఏర్పాటు చేసిన మిల్క్‌బ్యాంకు ఎంతో మంది చంటిబిడ్డలకు తల్లిపాలను అందిస్తోంది.

సేకరించేది ఇలా...!

బాలింతలు శిశువుకు జన్మనిచ్చిన తర్వాత తమ పిల్లలకు సరిపడా పాలు పట్టగలరు. అంతేగాకుండా కొందరికి అధికంగా ఉండి స్రావం అవుతుంటుంది. అధిక పాలతో ఆ తల్లి ఛాతీలో గడ్డలు



సేకరించిన తల్లిపాలను శుద్ధి చేస్తున్న దృశ్యం

ఏర్పడతాయి. అలాంటి పరిస్థితి ఏర్పడితే వారికి కొన్ని వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. అలాంటి బాలింతలను గుర్తించి వారి నుంచి మిల్క్ బ్యాంకు సిబ్బంది పాలను సేకరిస్తారు. పాల నుంచి ప్రత్యేక పద్ధతుల్లో బ్యాక్టీరియాను తొలగించి నిల్వ చేస్తారు. కొన్ని విధానాలతో సేకరించిన పాలను ఫ్రీజ్‌చేస్తారు. జిల్లాలో పీహెచ్‌సీలు, ఇతర ప్రాంతాల నుంచి గర్భిణులు కాన్పుకోసం జిల్లా ఆస్పత్రికి వస్తున్నారు. అయితే ఇక్కడికి వచ్చే తల్లుల్లో కొందరికి పోషకాహార లోపం, ఇతరత్రా కారణాలతో తల్లిపాలు ఇవ్వలేక పోతున్నారు. కాన్పు తర్వాత పాలు కూడా పట్టలేని పరిస్థితి. అలాంటి పరిస్థితుల్లో మాతాశిశు కేంద్రంలోని తల్లిపాల కేంద్రం ద్వారా అప్పుడే పుట్టిన బిడ్డలకు తల్లిపాలను సిబ్బంది అందిస్తున్నారు. ఇది ఎంతో మంది చిన్నారులకు తల్లిపాల లోటును తీరుతోంది.

ఇప్పటి వరకు గణాంకాలు ఇలా

పాలను ఇచ్చిన తల్లులు :	3377
పాల పరిమాణం :	2,075,690 మి.లీ.
ప్రయోజనం పొందిన పిల్లలు :	8,090
ప్రస్తుతం నిల్వ ఉన్న పాలు :	6,628 మి.లీ.

రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రామంతపూర్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటవ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ అధికారిణి అనసూర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఒకటవ తరగతిలో నాన్ రెసిడెన్షియల్ నందు అడ్మిషన్ కొరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒక సీటును కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలోని విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి జూన్ ఒకటవ తేదీ 2018 నుంచి మే 31వ తేదీ 2019 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను భద్రాద్రి ఐడీవోసి రూమ్ నెంబర్ ఎస్-27లోని ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థి ప్రతిభకు దేశస్థాయిలో గుర్తింపు



విద్యార్థిని అభినందిస్తున్న డీఈవో

పాల్వంచ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భద్రాది జిల్లా పాల్వంచ స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ విద్యార్థి ప్రతిభకు దేశస్థాయిలో గుర్తింపు లభించింది. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి ప్రతిభ చాటిన విద్యార్థి సిద్దుల హర్షవర్ధన్‌ను అభినందించి ఘనంగా సత్కరించారు. దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన రక్షణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల్లో ఒకటైన కర్నాటకలోని కొడవు సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొంది జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. హర్షవర్ధన్ సాధించింది ఓ అసాధారణ ఘనత అని.. ఈ విజయం కేవలం విద్యకు సంబంధించినది మాత్రమే కాదని, దేశ సేవకు పునాదులు వేయడంలో కీలకమని అన్నారు. గ్రామీణ నేపథ్యం కలిగిన విద్యార్థులు కూడా క్రమశిక్షణ, నిరంతరం కృషి, అంకితభావం ఉంటే ఇలాంటి ఘన విజయాలను సాధించవచ్చని హర్షవర్ధన్ నిరూపించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ భాస్కరరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాలలో వివరాలను సేకరిస్తున్న కేంద్ర బృందం

నాగుపల్లి పాఠశాలను సందర్శించిన కేంద్ర బృందం

దమ్మపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాగుపల్లి జిల్లాపరిషత్ పాఠశాలను స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీన్ పథకాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందం రేవతి ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించింది. పాఠశాలలో మరుగుదొడ్ల వినియోగం, విద్యార్థులు పరిశుభ్రత పాటించే విధానం, ఇంకుడుగుంతల నిర్మాణం, పరిసరాల పరిశుభ్రత, కూరగాయల పంటలకోసం కంపోస్టు ఎరువు తయారీ విధానం తదితర అంశాలను పరిశీలించారు. పలు వివరాలను హెచ్ఎం బజ్జూరి సరళను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించి బృందం సభ్యులు అభినందించారు.



సైకిల్ తొక్కిన మంత్రి పొంగులేటి, చిత్రంలో కలెక్టర్ అనుదీప్

విద్య, వైద్యానికి ప్రాధాన్యం

(5వ పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు కళాశాలను డిసెంబరు నెలకు అందిస్తామన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో నర్సింహారావు, నియోజకవర్గప్రత్యేకాధికారి రమేష్, తహసీల్దార్ రవికుమార్, క్యాంపుకార్యాలయం ఇన్‌చార్జి దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎంఈవో వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు

సైకిల్ తొక్కిన మంత్రి

కూసుమంచి హైస్కూల్ విద్యార్థినులకు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్యరెడ్డి సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఓ విద్యార్థినిని వెనుక కూర్చోబెట్టుకుని సైకిల్ తొక్కి.. చిన్నారుల్లో ఉత్సాహం నింపారు.

చేపల వేటకు వెళ్లి ముగ్గురి గల్లంతు

(5వ పేజీ తరువాయి)

8 మంది కట్టలేరు నదిలో చేపల వేటకు వెళ్లారు. వారు చేపలు పట్టే క్రమంలో భూక్యా కోటేశ్వరరావు(45), బాదవత్‌రాజు(50), భూక్యా సాయిరా(26) అనే ముగ్గురు నదిలోని బుడుగులోకి జారిపోయారు. అయితే మిగిలిన ఐదుగురుకి ఈతరాకపోవడంతో బుడుగు గుండంలోకి దిగి వారిని కాపాడే సాహసం చేయలేకపోయారు. వెంటనే ఒడ్డుపైకి చేరుకుని ఫోన్ ద్వారా గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు.. ఖమ్మం నుంచి ఎన్డీఆర్ఎఫ్ రెస్క్యూ బృందాన్ని రప్పించారు. ఆ బృందం గాలింపు చర్యలు చేపట్టగా. చీకటి పడటంతో కొంత ఇబ్బందిగా మారింది. అయినా గురువారం అర్ధరాత్రి లోపు గల్లంతయిన వ్యక్తుల ఆచూకీ తెలుసుకుంటామని ఎస్ఐ రమేష్ కుమార్ తెలిపారు. అయితే రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలకు చెందిన ఆ ముగ్గురు గల్లంతైన విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కట్టలేరు వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరవుతున్నారు. తమ వారు ప్రాణాలతో దొరుకుతారని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.



కట్టలేరులో గల్లంతైన వారి కోసం గాలిస్తున్న రెస్క్యూ బృందం

వ్యయసాయం.. పెట్టుబడి!

(5వ పేజీ తరువాయి)

కలిపి రూ.10వేల వరకు ఖర్చవుతోంది. అయితే మిర్చి పంటకు సంబంధించి విత్తనాలు, మొక్కనే అత్యధిక ఖర్చు కనిపిస్తోంది. ఎకరానికి 100గ్రాములు వరకు విత్తనాలు అవసరం అవుతోండగా.. పది గ్రాముల ప్యాకెట్లు 10 అవసరం అవుతాయి. అలా ఒక్కో ప్యాకెట్ రూ.850 కాగా.. ఎకరానికి విత్తనాలకయ్యే ఖర్చు రూ.8,500 అవుతోంది. అంతేకాదు ఆయా విత్తనాలను కొనుగోలు చేసిన అనంతరం వాటిని పెంచేందుకు నర్సరీ వారు ఒక్కో మొక్కకుగాను రూ.60పైసలు వసూలు చేస్తున్నారు. ఇలా ఎకరానికి రూ.8వేల నుంచి రూ.9వేల వరకు మొక్కలు పడతాయి. ఇలా లెక్కిస్తే మిర్చి పంటకు సంబంధించి ఇప్పటివరకు సగటున రూ.15వేలు ఖర్చు చేయగా.. ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గిన క్రమంలో 70 వేల ఎకరాలకు లెక్కించినా రూ.100కోట్ల వరకు ఖర్చు కనిపిస్తోంది. ఇక కంది, పెసర, మినుములు లాంటి ఇతర పంటలు మూడు లక్షల ఎకరాల వరకు ఉండగా.. వాటికి సగటున రూ.5వేలు లెక్కించినా రూ.150కోట్ల వరకు ఖర్చు చేశారు. ఒకవేళ కౌలు రైతులు అయితే సంబంధిత పొలం యజమానికి ఎకరాలకు రూ.20వేల వరకు అదనంగా చెల్లించాల్సిందే మరి. కాగా ఆయా పంటలకు సంబంధించి జూన్, జూలై నెలల్లో రైతులు పంటలకు పెట్టిన ఖర్చు రూ.వెయ్యి కోట్లు దాటగా.. ముున్ముందు దీనికి మూడింతల ఖర్చును రైతులు భరించాల్సి ఉంది.

పెట్టు'బడి' ఖర్చు భారం..

సామాన్య, మధ్య తరగతి ప్రజలు నుంచి మొదలుకొని అత్యధిక శాతం మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకే మొగ్గుచూపుతున్నారు. అలా ఈ ఏడాది జూలై నెలలో పాఠశాలలు ప్రారంభమైన సమయం నుంచి మొదలుకుని యూనిఫాం, కొత్త అచ్చు పుస్తకాలు, నోట్ పుస్తకాలు, క్యారేజీలు, బ్యాగ్‌లు ఇతరత్రా సామగ్రి కొనుగోలు చేయాల్సిన సమయం. వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఏటా పిల్లలకు కావాల్సిన విద్యా సామగ్రి అన్నిటినీ సమకూర్చడానికి అయ్యే ఖర్చు విద్యార్థుల తల్లిదండ్రులకు గుదిబండగా తయారవుతోంది. వీటన్నింటికీ తోడు అడ్మిషన్ ఫీజు మరో ఎత్తు.. ఇలా ఫీజులు మినహాయించి ఒక్కో విద్యార్థికి సగటున రూ.10వేల వరకు ఖర్చవుతుండగా.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండున్నర లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్నారు. ఇలా లెక్కిస్తే పాఠశాల, కళాశాలల్లో అడుగుపెట్టేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు పెట్టిన ఖర్చే రూ.250కోట్లుగా కనిపిస్తోంది. ఇక పోతే ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీల్లో చేర్చాలంటే రూ.25వేల వరకు చెల్లించాల్సి వస్తుంది. ఒకటి నుంచి మూడో తరగతి వరకు రూ.25వేల నుంచి రూ.40వేలు, 4 నుంచి ఏడోతరగతి వరకు రూ.45 వేల వరకు ఉంది. 8వతరగతి నుంచి 10వరకు రూ.55వేల వరకు ఫీజు రూపంలో వసూలు చేస్తున్నారు.

● కళాశాలల విషయానికొస్తే పలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరానికి వస్తే రూ.80 నుంచి లక్ష ద్వితీయ సంవత్సరానికి రూ. 1.50లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఇలా పాఠశాల ప్రారంభ సమయం పూర్తికాగానే చెల్లించే మొదటి టర్మ్ ఫీజును లెక్కిస్తే రూ.500కోట్లకు పైగానే ఉంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇక ఫీజులు, యూనిఫాం, పుస్తకాలు అన్నిటితో పాటు పిల్లలను స్కూలుకు పంపి, తీసుకొచ్చేందుకయ్యే రవాణా ఖర్చులకూ సామాన్యులు సతమతమవ్వాల్సిందే మరి. పెద్ద పాఠశాలల్లో అయితే నేరుగా ఫీజుతో పాటే కలిపి బస్సు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇక ఈ ఖర్చులైతే నోటికి ఎంత వస్తే అంతే అన్నమాట. కనీసం రూ.10వేల వరకు రవాణా ఖర్చులకింద వసూలు చేస్తుండగా.. సగం మందికి పైగా విద్యార్థులు ఆయా పాఠశాల వాహనాల్లోనే వెళ్తున్నారు. అలా లెక్కిస్తే రూ.100కోట్లుగా ఉంటుందని అంచనా.. ఇలా గడిచిన రెండు నెలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు పెట్టిన ఖర్చు రూ.850కోట్ల వరకు ఉంటుందని అంచనా.. కాగా విద్యాసంవత్సరం పూర్తయ్యే సమయానికి వారు కూడా దానికి రెండింతలు ఖర్చు చేయాల్సిందే మరి.

సమాచార హక్కు చట్టం..ప్రజల ప్రాథమిక హక్కు

(5వ పేజీ తరువాయి)

చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజల సమాచారం కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం అందించాలని తెలిపారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం వద్ద సిటిజన్ చార్ట్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సరైన కారణాలు చూపించకుండా ఆర్టీఐ యాక్టు ద్వారా చేసుకున్న దరఖాస్తులను తిరస్కరించవద్దన్నారు. సమాచార హక్కు చట్టం అందుబాటులో ఉందని.. అధికారులందరూ బాధ్యత తీసుకొని త్వరితగతిన తగిన సమాచారం ప్రజలకు అందించాలన్నారు. పౌరసమాచారశాఖ అధికారులకు అవగాహన పెంపొందించే విధంగా రాష్ట్రంలో 11 జిల్లాలు ఎంపిక చేసుకొనిచట్టంలోని సెక్షన్లపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీని ద్వారా ఆర్టీఐ కేసులను త్వరితగతిన పరిష్కరించవచ్చన్నారు. అధికారులు ప్రజలకు తగిన సమాచారం అందించేందుకు ముందుకు రావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాల్లో 17శాఖల్లో వచ్చే మార్చి లోపు అన్ని కేసులకు పరిష్కారమార్గాలు చూపి సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరుగున పడిన వ్యవస్థను నూతన ఉత్సాహంతో ముందుకొచ్చి ప్రజలకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

జిల్లాలో సమాచార హక్కు చట్టం పటిష్ఠంగా అమలయ్యేలా చర్యలు
కలెక్టర్ జితేష్ వి పాటిల్

జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని పటిష్ఠంగా అమలయ్యే అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించే విధంగా సమావేశాలు, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు



మొక్కలు నాటుతున్న ఆర్టీఐ కమిషనర్లు, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ

చెప్పారు. ప్రజలకు ఎలాంటి పరిస్థితుల్లోనైనా సమాచారం కావాలని దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనలకు లోబడి సమాచారం అందించే విధంగా అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా పౌర సరఫరాల అధికారులకు సమాచార హక్కు చట్టంపై ఉన్న సందేహాలను కమిషనర్లు నివృత్తి చేశారు. జిల్లాకు మొదటిసారిగా విచ్చేసిన సమాచార హక్కు కమిషనర్లను జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్ శాలువా, మెమొంటోలతో సన్మానించారు. అంతకుముందు జిల్లాకు వచ్చిన కమిషనర్లకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, జిల్లా ట్రైనింగ్ కలెక్టర్ సౌరభ్ శర్మలు పూలమొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో వన మహోత్సవ కార్యక్రమంలో కమిషనర్లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ అవగాహన సదస్సులో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవోలు మధు, దామోదర్, అన్నిశాఖల పౌర సమాచార అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డుమ్మా ఉపాధ్యాయులకు చెక్!

(5వ పేజీ తరువాయి)

డాక్టర్ యోగితారాణి ఈ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు పాఠశాల విద్యార్థుల హాజరు కోసం ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను వినియోగించే వారు. విద్యార్థుల హాజరు శాతం, ఏ రోజుకు ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా తెలుసుకోవడానికి వీలు కలుగుతుంది. ప్రస్తుతం ఈ విధానాన్ని శుక్రవారం నుంచి భద్రాద్రి జిల్లాలో అమలు చేయనున్నారు. ఉపాధ్యాయుల హాజరు తీసుకోవడం వల్ల వారు సకాలంలో పాఠశాలకు హాజరవుతారని విద్యాశాఖ భావించింది. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అమలు చేస్తోంది.

● భద్రాద్రి జిల్లాలో 1,309 పాఠశాలలు ఉండగా.. ఇందులో 1,024 ప్రాథమిక, 164 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 105 గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు, 1,835 స్కూల్ అసిస్టెంట్స్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు 170, లాగ్వేజ్ పండిట్స్, ఎస్‌జీటీలు, ఇతరులు కలిసి 2,269మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

● ఖమ్మం జిల్లాలో మొత్తం ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలలు 1,151 పాఠశాలలు ఉండగా 61,645 విద్యార్థులు చదువుతున్నారు. 5,004 మంది టీచర్లు పని చేస్తున్నారు. కేజీబీవీలు, మోడల్ స్కూల్స్‌తో పాటు ప్రత్యేక విభాగ పాఠశాలలు, ప్రైవేటు ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలు 374 పాఠశాలు ఉండగా 1,22,242 మంది విద్యార్థులు చదువుతుండగా, 5,717 మంది టీచర్లు పని చేస్తున్నారు.

యాప్‌లో ముఖ హాజరుకు రిజిస్ట్రేషన్ ఇలా....

ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను అప్‌డేట్ చేసుకొని, యుజర్ నేమ్‌లో పాఠశాల యుడైస్ కోడ్ ఎంటర్ చేసి, పాస్ వర్డ్‌గా ఇంగ్లీషులో స్కూల్123 టైప్ చేసి లాగిన్ కావాలి. ముందుగా ఉపాధ్యాయులు యుడైస్‌లో నమోదు అయ్యారా? లేదా చెక్ చెసుకోవాలి. యాప్‌లో లాగిన్ అయ్యాక స్టాఫ్ రిజిస్ట్రేషన్ అనే అప్షన్ టీచర్ల పేర్లన్ని ఉంటాయి. సంబంధిత ఉపాధ్యాయులు తమ ఫోటోను అప్‌లోడ్ చేసుకున్న తరువాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ తరువాత యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే హెచ్ఎంలతో పాటు ఉపాధ్యాయుల ఫోన్లకు ఎంఆర్‌సీల నుంచి సమాచారం పంపారు.

నిబంధనలపై రాని స్పష్టత..

అయితే ఎఫ్ఆర్ఎస్‌పై స్పష్టమైన నియమ నిబంధనలు రావాల్సి ఉంది. పెద్దపల్లి జిలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన అధికారులు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఎఫ్ఆర్ఎస్ తీసుకునేవారు.

ఉదయం 9:15గంటలకు ముందు, సాయంత్రం 4:15 గంటల తర్వాత ఎఫ్ఆర్ఎస్ తీసుకుంటారు. ఇది ఉపాధ్యాయులు తమ ఫోన్‌లో కూడా యాప్ ద్వారా ఎఫ్ఆర్ఎస్ తీసుకుంటారు. ఇంటి దగ్గర నుంచే ఎఫ్ఆర్ఎస్ తీసుకోకుండా స్కూల్ డైస్‌కోడ్ ద్వారా లాంగ్‌ట్యూడ్, లాటిట్యూడ్‌తో ఎఫ్ఆర్ఎస్ నమోదు జరుగుతుంది. ఈ యాప్ 100-500 మీటర్ల దూరం వరకు హాజరు నమోదుకు వీలు కలుగుతుంది. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఎఫ్ఆర్ఎస్ విధానం వల్ల ఉపాధ్యాయుల హాజరు శాతం 90-92 శాతానికి పెరిగిందని అధికార గణంకాలు చెబుతున్నాయి.

ఎఫ్ఆర్ఎస్ అయితే ఏంటి?

ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు హాజరు కావడానికి ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేయబోతున్నారు. ఉదయం, సాయంత్రం హాజరు ఉంటే చాలు అని ప్రస్తుతం కొందరు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. అదే సమయంలో హెడ్‌మాస్టర్ ఉదాసీనంగా ఉంటే.. ఉదయం పాఠశాలకు వచ్చి ఎఫ్ఆర్ఎస్ తీసుకొని మధ్యలో బయట పనులు చేసుకుని సాయంత్రం హాజరైతే సరిపోతుందని మరికొందరు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఇకపై ఇలాంటి వాటికి క్షేత్రస్థాయిలో చెక్ పట్టేందుకు ఉన్నతాధికారులు ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేయనున్నారు. ఈ క్రమంలో ప్రధానోపాధ్యాయులు మున్ముందు మరింత బాధ్యతాయుతంగా ఉండి.. ఉపాధ్యాయుల పనితీరుతో పాటు వారి హాజరు శాతాన్ని పకడ్బందీగా పర్యవేక్షించాల్సి ఉంది.

అక్టోబర్ వరకు 122 మెగావాట్ల

సోలార్ ప్లాంట్ల నిర్మాణం పూర్తవ్వాలి

(5వ పేజీ తరువాయి)

గనుల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలపైనా అధ్యయం జరపాలన్నారు. ఈ మేరకు వెంటనే నివేదికలు రూపొందించాలన్నారు. ఇందుకోసం అధికారులు ప్రత్యేక దృష్టితో అంకితభావంతో పని చేయాలని బలరాం సూచించారు. రాజస్థాన్ రాష్ట్రంలో రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ వారితో కలిసి అక్కడ 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఇప్పటికే ఒప్పందం కుదిరిందన్నారు. అందువల్ల త్వరలోనే ఒక ఉన్నత స్థాయి అధికారుల బృందం అక్కడికి వెళ్లనున్నట్టు తెలిపారు.

అందువల్ల పనుల్లో ఎలాంటి అలసత్వం పనికి రాదని, చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు డి. సత్యనారాయణ రావు, ఎల్‌వి. సూర్యనారాయణ, కే. వెంకటేశ్వర్లు, గౌతమ్‌పోట్రు, జీఎం (సీడీఎన్) ఎన్‌డీఎం సుభాని, జీఎం (సీపీపీ) ఎ. మనోహర్, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చిరంజీవులు, పవర్ ప్రాజెక్ట్స్ శాఖ అధిపతి విశ్వనాథరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థను చేయాలి

- సింగరేణి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలి
- జీవో 282 రద్దు చేసి కార్మిక హక్కులను కాపాడాలి
- ఖమ్మంలో టీయూసీఐ భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట నిరసన



ప్రదర్శన నిర్వహిస్తున్న టీయూసీఐ కార్మికులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఒకే పనికి ఒకే ఉద్యోగ విధానం అమలు చేస్తూ రాష్ట్రంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలను తక్షణం రద్దు చేసి ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామయ్య డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ముట్టడి చేపట్టారు. ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో కార్మికులతో భారీ ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టి, డీఆర్వో, కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పోకడలనే కాంగ్రెస్ అమలు చేస్తొందని ఆరోపించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విదంగా జీవో నెంబర్ 282ను అమలు చేసి పది గంటల పని విదానాన్ని అమలులోకి తీసుకొచ్చి కార్మిక వ్యతిరేక ప్రభుత్వంగా కాంగ్రెస్ పేరు తెచ్చుకుందని ఆరోపించారు. ఆర్థిక బకాయిలు పేరుతో నెలల తరబడి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. కొన్ని సంస్థలు, ప్రభుత్వశాఖల్లో ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లింపులను ప్రశ్నించిన కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. సింగరేణి, ప్రభుత్వ వైద్యశాలలు, జిల్లా హాస్పటల్స్ గ్రామ పంచాయతీలు, కేజీబీవీ కార్మికులు వెట్టి చాకిరికి గురైతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస సామాజిక భద్రత కల్పించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమాల్లో పుల్లారావు, ములకలపల్లి లక్ష్మీనారాయణ, గోసు పుల్లయ్య, పేరబోయిన వెంకన్న, అశోక్, పాపారావు, మధుర, కృష్ణవేణి, రమేశ్, రాంబాబు, దున్న గురవయ్య, కిన్నెర నారాయణ, గోడుగు విజయ్, పెదపాక వెంకన్న, అమరహడి అప్పారావు, మీగడ సైదులు, కంకణాల శ్రీనివాస్, ఎడ్లపల్లి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నిండగ.. అలుగుల పండుగ

- రూ.66కోట్లతో మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తి
- మత్తడులు పోస్తున్న 33 చెరువులు
- అలుగు నీటికి గిరిజన రైతుల పూజలు



రేగులకుంట చెర్వు వద్ద అలుగుల పండుగ నిర్వహిస్తున్న గిరిజన రైతులు

రఘునాథపాలెం, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలోని గిరిజన రైతులు అలుగుల పండుగను నిర్వహించారు. ఖమ్మం అర్బన్‌గా ఉన్న ప్రాంతాన్ని గతంలో ఖమ్మం ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం పేరుతో మండలంగా ఆవిర్భవింపజేశారు. 90శాతానికి పైగా గిరిజన జనాభా ఉన్న ఈ మండలంలోని రైతులు కూరగాయాలు, పూలు, పండ్ల తోటలు సాగు చేసి ఆ ఉత్పత్తులను ఖమ్మం నగరానికి సరఫరా చేస్తున్నారు. అయితే సరైన సాగునీటి సౌకర్యం లేక పోవటంతో పూర్తిగా వర్షాధారంపై వారంతా ఆధారపడి పంటలు పండిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం మండలానికి సాగర్ జలాల్ని తీసుకరావాలని కార్యాచరణ చేశారు. వెనువెంటనే వి.వెంకటాయపాలెం వద్ద ఉన్న కెనాల్ నుంచి నీటిని ఎత్తిపోసేలా మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటరెడ్డి వెంకటరెడ్డితో స్వయంగా మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయించారు. రూ.66కోట్లతో నిర్ణీత వ్యవధిలో ఈ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయంచగా.. ఇప్పుడు మండలంలోని 33 చెరువులకు సాగర్ జలాలు చేరి అవి మత్తడులు పోస్తున్నాయి. దీంతో గురువారం రేగులకుంట, మంచుకొండ చెరువుల అలుగుల వద్ద గిరిజనులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు అలుగుల పండుగ నిర్వహించారు. అలుగుల వద్ద పూలు చల్లి, గిరిజన సంప్రదాయ నృత్యాలు చేశారు. మంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి.. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీప్లానాయక్, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, బండి వెంకన్న, బాతుల సుధాకర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ గదిలో మందుల నిల్వ ఏంటి?

- ఉల్వనూరు వైద్య సిబ్బందిపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ కన్నెర్ర



ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

పాల్వంచ రూరల్/ లక్ష్మీదేవిపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరగాలి ఇలా ఉంటే ఎలా.. ఆపరేషన్ గదిలో మందులు నిల్వచేయడం మంచి పద్ధతి కాదని అసలు ఆపరేషన్ గది తెరుస్తున్నారాన లేదా అంటూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉల్వనూరు వైద్య సిబ్బందిపై కన్నెర్ర చేశారు. పాల్వంచ, కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లి మండలంలోని రేగళ్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పాల్వంచ ఏజెన్సీ గ్రామాల్లో ఉన్న రేగళ్ల, ఉల్వనూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది హజరు, ఔషధ నిల్వలు, శుభ్రత, రోగులకు అందిస్తున్న సేవల నాణ్యతను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో ఉన్నటువంటి ఆపరేషన్ గది, లేబర్ రూంను కలెక్టర్ పరిశీలించి ఆపరేషన్ గదిలో మందులు నిల్వ ఉండటాన్ని గమనించి ఇక్కడ ఎందుకు నిల్వ చేశారు.. ఆపరేషన్ థియేటర్ ఉపయోగిస్తున్నారా.. లేదా అని వైద్యులను ప్రశ్నించారు. వైద్యులు మూడు నెలలకు సంబంధించి మందులను ముందుగా నిల్వ చేసినట్లు తగిన ప్రదేశం లేక ఇక్కడ నిల్వ చేసినట్లు వివరించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ సిబ్బందిని అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతు ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత మనపై ఉందని, ప్రజల్లో వైద్య వ్యవస్థపై నమ్మకం పెరగాలని పేర్కొన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వల్ల వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ఉన్నందున తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నా రు. ఆరోగ్య కేంద్రాలు గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తమ విధుల్లో నిబద్ధతతో, సమయపాలన పాటిస్తూ సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రిలో రోగుల కోసంఅవసరమైన రక్త పరీక్షలు, సీజనల్ వ్యాధుల నివారణకు మందుల సరఫరా, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థుల 'పీఎం ట్రిప్'

- మినీ బస్సుల్లో విద్యార్థుల తరలింపుపై విమర్శలు
- 200 మందికి రెండు బస్సులు మాత్రమేనా అని ప్రశ్నలు



పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న బస్సు

మణుగూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పినపాక మండలంలోని ఎల్చిరెడ్డి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం పీఎం ట్రిప్ కార్యక్రమం కింద పలు ప్రాంతాల సందర్శనకు తీసుకెళ్లారు. ఇందులో భాగంగా మణుగూరులోని 100 పడకల ఆస్పత్రి, అగ్నిమాపక కేంద్రాల పరిశీలనలు జరిగాయి. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న సేవలపై హైస్కూల్ బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం అగ్ని మాపక కేంద్రంలో ఉద్యోగులు తమ విధులు, శాఖ పని విధానాలను వారికి వివరించారు. అయితే ఈ పీఎం ట్రిప్ సర్వత్రా విమర్శలకు దారి తీసింది. ట్రిప్ కోసం రూ.లక్షలు కేటాయిస్తున్నా.. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసేలా రెండు ప్రవేటు స్కూల్ బస్సుల్లో 200మందిని తరలించడం.. వారితో పాటు కొందరు ఉపాధ్యాయులు కూడా ఉండటం చర్చనీయాంశంగా మారింది. చిన్నబస్సులు వాటిలో తొమ్మిది, పదో తరగతి చదివే దాదాపు 200 మంది విద్యార్థులను ఎక్కించి ప్రయాణాలు చేయించడం చర్చనీయాంశంగా మారింది. కేవలం 120 మంది వరకు మాత్రమే పట్టే బస్సుల్లో వారిని ఎక్కించి దాదాపు 30కిలోమీటర్ల దూరం వరకు రాకపోకలను సాగించడం విమర్శలకు తావిచ్చింది. అందులో ఒకరిపై ఒకరు కూర్చొని ప్రయాణించడం గమనార్హం. అయితే ఇటీవల ఇదే పాఠశాల విద్యార్థులను మణుగూరులోని బీటీపీఎస్, అంతకు ముందు హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లగా.. ఆ సమయంలో వారినెలా తీసుకెళ్లారోనన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇప్పటికైనా పాఠశాల నిర్వహాకులు ఇలాంటి ప్రయాణాలు చేపట్టకుండా ఉండటం మంచిదని, పీఎం ట్రిప్ నిధులను సద్వినియోగం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

రామయ్యను దర్శించిన ఆర్టీఐ కమిషనర్లు



రామాలయంలో ఆర్టీఐ కమిషనర్లు

భద్రాచలం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారిని గురువారం ఆర్టీఐ కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బీ.అయోధ్య రెడ్డి, డి.భూపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రవణ్‌కుమార్, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

రామాలయంలో సుదర్శన హోమం

రామాలయంలో గురువారం సుదర్శన హోమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అందులో భాగంగా ముందుగాసుదర్శన పెరుమాళ్లను యాగశాల ప్రాంగణంలోకి తీసుకొచ్చి ఆసీనులను చేశారు. అదేవిధంగా స్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు అర్చకులు అమరవాది వెంకట్రామన్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసే వరకు ఉద్యమిస్తాం

● తెలంగాణ జాగృతి భద్రాద్రి జిల్లా ఇన్‌చార్జ్ వీరన్న

కొత్తగూడెం టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేంత వరకు ఉద్యమాలు నిర్వహిస్తామని తెలంగాణ జాగృతి జిల్లా ఇన్‌చార్జి డి. వీరన్న తెలిపారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4, 5తేదీల్లో హైదరాబాద్‌లో జాగృతి అధ్యక్షురాలు కవిత నిర్వహించే నిరాహారదీక్షలను విజయవంతం చేయాలని కోరారు. నిరాహారదీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పవన్, సురేష్, రమణయ్య, రాజేందర్, పృధ్వీరేణుక, స్వరూప, ఆదినారాయణ, ప్రసాద్, వెంకన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బనకచర్ల పై బీఆర్ఎస్‌ది కపట నాటకం

- ఆపార్టీ నేతల వ్యాఖ్యలను ఖండించిన టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరిగే నష్టమేమీ లేదని టీడీపీ నాయకులు మందడపు సుధాకర్, కేతినేని హరీష్ అన్నారు. గురువారం టీడీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను వారు ఖండించారు. నదుల అనుసంధానంలో భాగంగా 2018లోనే గోదావరి, కృష్ణాజలాలను 400 టీఎంసీలను వినియోగించుకోవచ్చని సూచన ప్రకారమే ఈప్రాజెక్టు రూపకల్పన చేస్తున్నారని చెప్పారు. తెలంగాణలో టీడీపీ పునర్వైభవాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు చంద్రబాబు నాయుడుపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని వీటిని తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితులో లేరన్నారు.రాయలసీమను రత్నాల సీమ చేస్తానన్న కేసీఆర్.. జగన్ సర్కారుతో అంటకాగి ఆనాడు ప్రకటించిచారని అన్నారు. కేతినినేని హరీష్ మాట్లాడుతూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఏ పార్టీతో పొత్తులు ఉండవని తేల్చి చెప్పారు. కలిసొచ్చే పార్టీలు ఏమైనా ఉంటే అది మా అధిష్టానం నిర్ణయిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో చింతనిప్పు నాగేశ్వరరావు, కోలికొండ మురళి, నాగండ్ల మురళి, దామ శ్రీను, బోయిన వెంకన్న, రమేష్ శివ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

- పది మందిపై కేసు నమోదు
- రూ.56 వేలు, నాలుగు ద్విచక్రవాహనాల స్వాధీనం

మణుగూరుటౌన్, జూలై31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముత్యాలమ్మనగర్ ఓ రహస్య ప్రాంతంలో ఏర్పాటు చేసిన పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. మణుగూరు సీఐ పాటి నాగబాబు ఈ వివరాలు తెలిపారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు దాడులు చేయగా పదిమంది పేకాట రాయుళ్లను అదుపులో తీసుకున్నామన్నారు. సంఘటనా స్థలంలో వద్ద రూ.56వేల నగదు, పది సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ రంజిత్,కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మామిళ్లవారిగూడెం సమీపంలోని పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నారు. సమాచారం మేరకు గురువారం ఎస్ఐ యయాతిరాజు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.20,100 నగదును స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

పొలంలో రైతు హఠాన్మరణం

- కొణిజర్లలో ఘటన
- నివాళులర్పించిన సీపీఐ నేతలు భాగం, దండి



కొణిజర్ల, జూలై31(ఆంధ్రజ్యోతి): పొలం పనులు చేస్తుండగా ఓ రైతు గుండెపోటుతో మృతి చెందిన విషాద సంఘటన మండలకేంద్రమైన కొణిజర్లలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన బండారు పుల్లయ్య(63) తన పొలం వద్దకు వెళ్లాడు. శుక్రవారం వరినాటు వేసేందుకు కూలీలు సిద్ధమవుతున్నారు. ఈక్రమంలో కూలీలు పీకిననారును మడుల్లో కట్టలు కట్టి వేస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా గుండె నొప్పి రావడంతో పొలంలోనే కుప్పకూలాడు. వెంటనే కూలీలు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బండారు పుల్లయ్య సీపీఐ సీనియర్ నాయకుడుగా పని చేస్తున్నాడు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా నాయకులు యర్రాబాబు, దొండపాటి రమేష్, పీవీరావు, మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో నాయకులు తాటి వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, తోటపల్లి సీతరాములు, తండు సోమయ్య, తదితర నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

చికిత్స పొందుతూ మృతి

దుమ్ముగూడెం, జూలై 31(ఆంధ్రజ్యోతి): నడికుడి గ్రామశివారు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురైన కొర్సా రామకృష్ణ(42) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పొలం నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, ఓ వ్యక్తి కారును అతివేగంగా,అజాగ్రత్తగా నడిపి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బాధితుడిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీరాం ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి ..

అశ్వారావుపేటరూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. ఎస్ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన సన్నెపల్లి సుబ్బారావు(48) బంధువుల ఇంట్లో వివాహం ఉంది. దీంతో ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట వచ్చి దుస్తులు కొనుగోలు చేసి తిరిగి ఇంటికి వెళుతున్నారు. ఈక్రమంలో మండలంలోని తిమ్మాపురం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సుబ్బారావును అశ్వారావుపేటలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య,కుమారుడు ఉన్నారు.కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకుపోలీసులు కేసునమోదు చేశారు.

ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో మోకీలు ఆపరేషన్

ఖమ్మం కలెక్టరేట్ , జూలై 31 (ఆంధ్రజ్యోతి): మోకాళ్ల కీళ్ల మార్పిడి ఆపరేషన్లు చాలా ఖరీదుతో కూడుకున్న వైద్యం... ప్రైవేటు కార్పోరేట్ ఆస్పత్రుల్లో చేయించుకుంటే కనీసం రూ.2లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఇంత మొత్తాన్ని భరించడం నిరుపేదలకు ఆర్థికంగా భారంగా ఉంటుంది. ఇలాంటి రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మోకాళ్ల కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేస్తున్నారు. గురువారం జిల్లా ఆస్పత్రిలో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన బి.కళ్యాణి అనే 55 మహిళలకు మోకీలు మార్పిడి చేశారు. డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో డాక్టర్ వినయ్, డాక్టర్ మణికంఠ, డాక్టర్ మనీష్, తదితరులు ఆపరేషన్ చేశారు.

నాలుగెకరాల కౌలు వేలానికి..
80మంది కానిస్టేబుళ్ల బందోబస్తు!

- బొట్లకుంట రామాలయ భూమిపై వివాదం
- కోర్టు ఉత్తర్వులతో వేలం పూర్తి



ఆలయం వద్ద బందోబస్త్ నిర్వహిస్తున్న పోలీస్‌లు

కొణిజర్ల, జూలై31(ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులు ప్రకారం మండల పరిధిలోని బొట్లకుంట గ్రామంలో గల రామాలయం భూమికి గురువారం వేలం నిర్వహించారు. ఏసీపీ రహమాన్ ఆధ్వర్యంలో 80మంది కానిస్టేబుళ్ల బందోబస్త్ మధ్య వేలం పూర్తి చేశారు. సర్వేనెంబరు 298, 348పరిధిలో ఈ ఆలయానికి 4.20ఎకరాల భూమి ఉంది. ఆ భూమిపై గ్రామంలో రెండు వర్గాల మధ్య వివాదం నెలకొన్నది. దేవాదాయ అధికారులు కోర్టునుఆశ్రయించారు. గురువారం రెండు సంవత్సరాలకు వేలం నిర్వహించారు. మొత్తం 16మంది రైతులు పాల్గొనగా వారిలో నలుగురు రైతులు పోటీ పడ్డారు. తడికమళ్ల సుధాకర్ ఏడాదికి రూ.54వేలు కౌలు ఇచ్చే విధంగా వేలంలో దక్కించుకున్నాడు. అధికారులు తొలి ఏడాడి కౌలును సుధాకర్ నుంచి తీసుకున్నారు. కౌలువేలం పాట ప్రశాంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు జగన్‌మోహ్మన్‌రావు, వెంకటేశ్వరరావు, శేషయ్య, శ్రీకాంత్, అర్చకులు వీరభద్రశర్మ, కృష్ణామాచార్యులు, సిబ్బంది వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు తదితరులు కౌలువేలంను నిర్వహించారు. ఏసీపీతో పాటు సీఐలు సాగర్, మధు, రమేష్ ఆధ్వర్యంలో బందోబస్త్‌ను నిర్వహించారు.

ఆలయంలో మద్యం బాటిళ్లు

- అర్చకుడిని మందలించిన దేవాదాయశాఖ అధికారులు



గర్భగుడిలో ఉన్న మద్యం బాటిళ్లు

మణుగూరు,జూలై 31(ఆంధ్రజ్యోతి): మణుగూరు పరిధిలోని ఓ శివాలయం గర్భగుడిలో మద్యం బాటిళ్లు ఉండటం తీవ్ర చర్చనీయాంశమైంది. ఎండోమెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు జరిపిన క్రమంలో అవి కనిపించడంతో వారు ఆ ఆలయ అర్చకుడిని తీవ్రంగా మందలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలయంలో అర్చకుడిగా పనిచేసే శ్రీరామచంద్రమూర్తి మద్యానికి బానిసయ్యాడు.. ఇటీవల ఆయన మద్యం తాగి ఆలయ విధులకు వస్తున్నారని ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదులందాయి. దాంతో పలుమార్లు అధికారులు హెచ్చరించారు. ఆయినా ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో గురువారం ఎండోమెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేయగా.. గర్భగుడిలో ఓ మూలన ఖాళీ మద్యం సీసాలు దర్శనమిచ్చాయి. దీంతో అధికారులు ఆ అర్చకుడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే అతడిపై తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

కారేపల్లి మండలం విశ్వనాథపల్లిలో విషాదం



కారేపల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విశ్వనాథపల్లిగ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో బొగ్గరాపు సరస్వతి(55) మృతి చెందారు. వ్యవసాయం పనుల నేపథ్యంలో ఆమె ఉదయం పొలానికి వెళ్లారు. పనుల అనంతరం ఇంటికి వచ్చింది. తీగపై ఆరవేసిన బట్టలను తీస్తుండగా దండెం తీగకువిద్యుత్ సరఫరా అయింది. విద్యుదాఘాతానికి గురికాగా సమీపంలో ఉన్న ఓ వ్యక్తి కర్రతో తీగపై గట్టిగా కొట్టడంతో వదిలి వేసింది. అయితే అప్పటికే సరస్వతి మృతిచెందారు. మృతురాలకు భర్త కిషన్‌రావు, కుమార్తెఅనూషా,కుమారుడు అన్వేష్ ఉన్నారు.

అశ్వాపురం ఫారెస్టు రేంజర్ రమేష్ సస్పెన్షన్

అశ్వాపురం, జూలై31(ఆంధ్రజ్యోతి): అశ్వాపురం ఫారెస్టు రేంజ్ అధికారి ఎస్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ పీసీసీఎఫ్ సీ స్వర్ణ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. అశ్వాపురం ఫారెస్టు రేంజర్‌గా పని చేస్తున్న రమేష్ రేంజ్ పరిధిలో ఉన్న నెల్లిపాక బీట్ మొండికుంట కంపార్ట్‌మెంట్‌లో ఉన్న పోడుభూమికి సంబంధించి అవినీతికి పాల్పడినట్లు అటవీశాఖ ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో శాఖపరమైన విచారణ జరిపారు. రేంజర్‌పై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఈ చర్య తీసుకున్నారు. ఈ ఉత్తర్వులు ఉన్నంత కాలం రమేష్ హెడ్‌క్వార్టర్స్‌లో అందు బాటులో ఉండాలని ఎటువంటి లేకుండా హెడ్‌క్వార్టర్స్‌ను వదిలి వెల్లకూడదని ఆదేశాలు జారీ చేశారు.

ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల పట్టివేత

కామేపల్లి, జూలై 31(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన కామేపల్లి మండల పరిధిలోని హరిచ్చంద్రాపురంలో గురువారం చోటు చేసుకుంది. కామేపల్లికి చెందిన ఈ వాహనాలు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలించడంతో కామేపల్లి ఎస్ఐ బి. సాయికుమార్ ఆవాహనాలు స్టేషన్‌కు తరలించారు. మండల రెవెన్యూ అధికారులకు అప్పగించారు.



వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించే వృత్తి నైపుణ్య శిక్షణకు యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితి కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్, బ్యూటీషియన్ తదితర కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం హైదరాబాద్‌కు చెందిన సెట్విన్ సంస్థ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వనుందని ఆయన తెలిపారు. ఆగస్టు1 నుంచి కొత్త బ్యాచ్‌లు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. దరఖాస్తులు ఇవ్వడానికి, ఇతర సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియంలోని సెట్కం కార్యాలయంలో నేరుగా, 9948207271 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని కోరారు.

రహదారి తవ్వకం.. ప్రజలకు నరకం

- రిక్కా బజార్‌లో మార్చి నుంచి విస్తరణ పనులు
- నాలుగు నెలలుగా కొలిక్కిరాని వైనం
- అంబులెన్స్‌లు, ద్విచక్ర వాహనాలు వెళ్లలేని దుస్థితి
- 200మంది విద్యార్థులు, స్థానికులకు నరక యాతన




బ్రాహ్మణ బజార్‌లో రహదారికి అడ్డంగా తవ్వకాలు

ఖమ్మంకార్పొరేషన్, జూలై31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో అత్యంత పురాతనమైన, గతంలో ఎంతో కీలకమైన ప్రధాన రహదారి ఇప్పుడు నరకయాతనగా మారింది. రహదారి విస్తరణ పేరుతో తవ్వకాలు ప్రారంభించిన



ప్రమాదకరంగా ఇళ్లలో నుంచి బయటకు వస్తున్న మహిళ

అధికారులు నెలల తరబడి ఓ కొలిక్కి తీసుక రాకపోవటంతో విద్యార్థులు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్లలోనుంచి కాలు బయటకు పెట్టలేని దుస్థితి నెలకొంది.

పాతమున్సిపల్ కార్యాలయం నుంచి

పాతమునిసిపల్ కార్యాలయం నుంచి బ్రహ్మణబజార్ ద్వారా చర్చి కాంపౌండ్ సెంటర్ వరకు నేరుగా రహదారి ఉంది. పూర్వకాలం నుంచి పాత బస్టాండ్ నుంచి ముస్తాఫానగర్, చర్చికాంపౌండ్‌కు వెళ్లేందుకు ఖిల్లా,మేదర్‌బస్తీలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారిగా ఉంది. పూర్వకాలం నుంచి నివాసాలు ఉండటంతో ఆయా నివాసాలకు సరైన ధృవపత్రాలు లేవు. రహదారి విస్తరణ కార్యచరణ చేసి ప్రతిసారీ బాధితులకు పరిహారం చెల్లింపులో దస్త్రాలు లేక పోవటంతో దశాబ్దాలుగా రహదారి విస్తరణ కాలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరించిన తర్వాత అంతర్గత రహదారుల విస్తరణపై దృష్టి సారించారు. ఈ క్రమంలో ఈ రహదారిని 30 అడుగులకు విస్తరించాలని భావించారు. పనులను మార్చిలో ప్రారంభించారు. ఆనాటి నుంచి రహదారి, పైపు లైన్ నిర్మాణం పేరుతో తవ్వకాలు చేసి వదిలేస్తున్నారు. కానీ ఓ కొలిక్కి తీసుకురాలేదు. ఇదే రహదారి వెంట రెండు ప్రధానమైన పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 200లకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రధాన రహదారికి అడ్డంగా తవ్వకాలు జరిపి వర్షపు, మురుగు నీరు వెళ్లేందుకు తవ్వకాలు చేశారు. దీంతో రహదారిపై సైకిల్స్ కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ప్రజలు తాగునీటి డబ్బాల నుంచి నిత్యవసరాల సరుకులు తరలింపు వరకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వైద్యసేవలు వెళ్లాలంటే కనీసం ద్విచక్ర వాహనాలు, అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితి గలనాల్గు నెలలుగా ఉంది. కమిషనర్ అభిషేక్ అగస్త్య స్పందించి క్షేత్రస్థాయిలోని పరిస్థితిని గమనించి రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ఇళ్లపై విద్యుత్ తీగల తొలగింపు



నేలకొండపల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): మూటాపురం గ్రామంలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను అధికారులు తొలగిస్తున్నారు. గ్రామంలో కొన్ని ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వెళుతున్నాయని, తీగలు తగిలి ప్రమాదాలు జరగటంతో పాటుగా ప్రాణ నష్టం కూడా జరుగుతుందని సీడీసీ డైరెక్టర్ గుడిమళ్ల మధు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లినేని వెంకన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను తక్షణమే తొలగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈనేపథ్యంలో విద్యుత్ అధికారులు మూటాపురం గ్రామంలో ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అవసరమైన చోట్ల కొత్త విద్యుత్ స్తంభాలను వేస్తున్నారు.

శాశ్వత ప్రొఫెసర్లను నియమించాలి

'జేఎన్టీయూ' ఎదుట పీడీఎస్‌యూ ధర్నా

ఖమ్మంరూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజిలో శాశ్వత ప్రొఫెసర్లను నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు స్టాలిన్, శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మద్దులపల్లిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు.కళాశాల ఏర్పాటు చేసి మూడేళ్లవుతున్నా ఇక్కడ ఎలాంటి వసతులు లేవని, పూర్తిస్థాయి ఫ్యాకల్టీ కూడా నియమించాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్.యూ నాయకులు అలేఖ్య, అఖిల, స్పందన, కావ్య, లేఖ్య తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

రఘునాథపాలెం,జూలై31(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే డిగ్రీకాలేజీలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్స్‌పాల్ వేంసాని వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, కెమిస్ట్రీ,గణితం, స్టాటస్టిక్స్ మొత్తం ఐదు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని ప్రకటించారు. ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ, పీహెచ్‌డీ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని ఆ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 6వ తేది ఉదయం 10గంటలకు నేరుగా కళాశాలలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 95338 88851 లేదా 70326 32863 నెంబర్లుకు కాల్ చేయాలని సూచించారు.

సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- తరుణిహట్ ప్రాంగణం పరిశీలన



తరుణిహట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంరూరల్,జూలై31(ఆంధ్రజ్యోతి): సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులోని తరుణిహట్ ప్రాంగణాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి గురువారం పరిశీలించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణ డ్రాఫ్ట్ ప్లాన్ వివరాలను తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పాతబడిన, అనవసరమైన నిర్మాణాలను పూర్తిస్థాయిలో తొలగించాలని అధికారులకు సూచించారు. మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకే చోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలన్నారు. దీనికి తగిన విధంగా ప్రణాళికలు డిజైన్ తయారు చేయాలన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో సబ్ రిజిస్ట్రార్, వ్యవసాయశాఖ మొదలగు అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సముదాయం ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతు మండల కార్యాలయ సముదాయం అవసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్‌లో భాగస్వామ్యం చేయాలన్నారు. సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద అవసరమైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా త్రాగునీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలన్నారు. ప్రతీఫ్లోర్‌లో ప్రజల వెయింటింగ్ ఏరియా ఉండాలని అక్కడ త్రాగు నీటి ట్యాప్ ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి రమేష్, ఆర్డీఓ నరసింహరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథబాబు, తహసీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పాతమసీదు స్థలంలో షాదీఖానా నిర్మించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని 14వ డివిజన్‌లోని గొల్లగూడెం బొడ్రాయిసెంటర్‌లో ఇళ్ల మధ్య నిర్మించబడిన పాతమసీదు స్థలంలో షాదీఖానా లేదా ఉర్దూ మదర్సా కమ్యూనిటీహాల్ నిర్మించాలని అదే గ్రామానికి చెందిన మహ్మద్ మహబూబ్ అలీ కోరారు. గురువారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాతమసీదు స్థలంలో కొందరు నూతనంగా మసీదును కడుతున్నారని, దీంతో స్థానికంగా ఉండే చుట్టుపక్కల వారితో పాటు మాకు అసౌకర్యంగా ఉందన్నారు. ఈవిషయం మసీదు కమిటీ ముస్లిం పెద్దలకు, జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. జిల్లాఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

సహకరిస్తాం.. కూల్చివేతలు వద్దు

మేయర్ నీరజకు పీఆర్ఆర్ రోడ్డులోని ప్రజల వినతి



వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

ఖమ్మంకార్పొరేషన్, జూలై31(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీచౌక్ ప్రాంతంలో పొట్టిశ్రీరాములు రోడ్డు వెడల్పు విషయంలో స్వచ్ఛందంగా సహకరిస్తామని స్థానికులు మేయర్ పునుకొల్లు నీరజకు విన్నవించారు. పీఎస్ఆర్ రోడ్డు 35, 36 డివిజన్ల పరిధిలో వ్యాపించి ఉంది. ఖమ్మం నగరం నిర్మాణ సమయంలో ఏర్పడిన పురాతన భవనాలు ఇప్పటికీ ఉన్నాయి. అభవనాలను ఏ మాత్రం కూల్చినా అవి మొత్తం కుప్పకూలి పోతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రహదారి విస్తరణ పనులు కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. మళ్లీ కేఎంసీ అధికారులు విస్తరణ పనులకు ఏర్పాట్లు చేస్తుండటంతో.. గురువారం పీఎస్ఆర్ రోడ్డు ప్రాంతంలోని ప్రజలు మేయర్‌ను కలిశారు. తమగోడు తెలిపారు. రహదారి విస్తరణ సమయంలో స్వచ్ఛందంగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. నిబంధనలు పెట్టి భవనాలను కూల్చి పనులు చేయవద్దని విన్నవించారు. మిర్చి మార్కెట్‌కు వెళ్లే లారీలను మరో రహదారి ద్వారా పంపటం, లేదా వన్‌వే రూట్ ఏర్పాటు చేయటం ద్వారా సమస్య పరిష్కారం జరుగుతుందన్నారు.

మంజూరు పత్రాలు పంపిణీ

నగరంలోని 26, 30, 31, 32, 33, 34, 35 డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ పర్యటించారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల కృషితోనే పథకాలు అమలు జరుగుతున్నాయని తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు శ్రీలేఖ

కామేపల్లి, జూలై31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు జెడ్పీఎస్ఎస్ గోవింద్రాల 9వతరగతి విద్యార్థిని శ్రీలేఖ ఎంపికైయ్యారు. జూలై30న సర్దార్ పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అండర్ 14ట్రైయాతలాన్ విభాగంలో ఎంపికైంది. ఈ ట్రైయాతలాన్ విభాగంలో సుమారు 100మంది అథ్లెటిక్స్ పాల్గొన్నారు. వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌కు హాజరు కానున్నది. ఆమెను హెచ్ఎంనాగేశ్వరరావు, పీడీ ముజాహిద్, ఉపాధ్యాయులు అభినందించారు.



శ్రీలేఖను అభినందిస్తున్న హెచ్ఎం

ఘనంగా శాంతి హోమం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ 18వ వార్షిక పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం శాంతి హోమం నిర్వహించారు. ఉదయం 108కళశాలతో అష్టోత్తర శతకళశ స్నపనం, అగ్నిప్రతిష్ట నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. నేడు స్వామివారి గిరి ప్రదక్షణ నిర్వహిస్తున్నామని భక్తు అధిక సంఖ్యలో హాజరు కావాలని విన్నవించారు.

కడవెండికి కర్ణాటక రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై31 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న కర్ణాటక రాజ్‌భవన్‌లో పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం జరిగే కార్యక్రమానికి కర్ణాటక రాజ్‌భవన్ నుంచి ఫోన్ ద్వారా ఆహ్వానం అందినట్టు ఎకోక్లబ్ ఎన్విరాన్ మెంటల్ సొసైటీ సంస్థ వ్యవస్థాపకుడు కడవెండి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ సంక్షేమానికి సంబంధించిన విషయాలను, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాల్సిన అవసరాన్ని, పచ్చదనం పెంపుదల వంటి ముఖ్య అంశాలను గవర్నర్‌తో చర్చించనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి: డీఎంహెచ్‌వో



తిరుమలాయపాలెం,జూలై31(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో కళావతిబాయి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చంద్రుతండాలో పర్యటించారు. వైద్యసిబ్బంది అప్రమంగా ఉండి గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. చంద్రుతండా డెంగీ పాజిటివ్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించాలన్నారు. ఇంటింటి సర్వే చేసి జ్వరపీడితులను గుర్తించి వారికి మందులు అందించాలన్నారు.ఈకార్యక్రమంలో వైద్యాధికారి వసుంధర, హెచ్‌ఈవో వెంకటరెడ్డి, ఏపీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ఖమ్మంస్పోర్ట్స్‌జూలై31(ఆంధ్రజ్యోతి): ఈనెల5 నుంచి నగరంలో నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ పోటీల బ్రోచర్‌ను గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోటీలను గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోటీల నిర్వహణపై నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఏ సభ్యుడు వెంకన్న, నాయకులు పరీద్‌ఖాద్రి తదితరులు ఉన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దుర్గాప్రసాద్

రిటైర్డ్ ఉద్యోగులకు పోలీసుల సన్మానం

ఖమ్మంక్రైం, జూలై31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు పోలీసు కమిషనర్ సునిల్‌దత్ తన కార్యాలయంలో గురువారం సన్మానించారు. జ్ఞాపికలు అందించారు. సుదీర్ఘకాలంగా వివిధ విభాగాలలో విధులు నిర్వహించి పోలీసుశాఖకు ఎనలేని సేవలతో పోలీసు అధికారుల మన్ననలు పొందారని కొనియాడారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఏఎస్‌ఐలు ఎం.ముత్తయ్య, డి.లచ్చు, ఏఆర్‌ఎస్సై డి.మోహన్‌రావు, హెడ్ కానిస్టేబుళ్ల కె.సైదయ్య,ఎస్‌డీ మన్సూర్, కె.వెంకయ్య, ఆనందరావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎన్.బాలకృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, ఏఆర్ ఏసీపీ నరసయ్య, ఆర్‌ఐ కామరాజు, సురేష్, నాగుల్ మీరా, పోలీసు అసోసియేషన్ ఇన్‌చార్జి అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' నిర్వీర్యానికి కేంద్రం కుట్రలు

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం




మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన కేవిరెడ్డి, ప్రసాద్

నేలకొండపల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నంవెంకటేశ్వరరావు ఆరోపించారు. మండల పరిధిలోని బోదులబండలో గురువారం కే.వీ.రామిరెడ్డి, వడ్లమూడి నాగేశ్వరరావు, సరస్వతి అధ్యక్షవర్గంగా జరిగిన పాలేరు డివిజన్ వ్యవసాయ కార్మికసంఘం మహాసభలో మాటాడారు. తొలుత సంఘం జెండాను కట్టికోల చిన్నకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయం యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ కూలీలు పనులు దొరక్క ఇతరరంగాల వైపు మళ్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందల ఎకరాలున్న ధనికులకు రైతుభరోసా అందిస్తున్నారని, వ్యవసాయ కూలీలకు మాత్రం ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రూ.12వేలు ఇవ్వటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని, ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, కట్టికోల వెంకన్న, భూక్యా కృష్ణ, పొట్టపింజర వాణి, పొన్నెగంటి సంగయ్య, రచ్చా నర్సింహారావు, షేక్.బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, కొరదల సీతారాములు, పోతనబోయిన పెరుమాళ్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక...

మహాసభలో పాలేరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం డివిజన్ అధ్యక్షుడిగా కొప్పుల వెంకట్రామిరెడ్డి, కార్యదర్శిగా సంద్ర ప్రసాద్‌తో పాటుగా 27మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలి

ఐటీడీఏ అదనపు డీఎంహెచ్‌ఓ సైదులు

కామేపల్లి, జూలై31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే వ్యాధులను నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ భద్రాచలం అదనపు డీహెచ్‌ఎంఓ డా. సైదులు సూచించారు. గురువారం కామేపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. పల్లెదవాఖానల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. కీటకజనక వ్యాధులపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. అనంతరం సీహెచ్‌ఓ సుధారాణి పదవి విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో వైద్యులు నెల్లూరి చందన, శిరీష, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక నిర్వహణతోనే మహిళా సంఘాల పురోగతి

- జాతీయ రిసోర్స్ పర్సన్ డాన్‌బాస్కో
- నాలుగు రోజులు పాటు సాగిన ఆర్పీల జిల్లా స్థాయి శిక్షణ

ఖమ్మంకార్పొరేషన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): పుస్తక నిర్వాహణతోనే మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక పురోగతి, క్రమశిక్షణ ముడిపడి ఉంటాయని జాతీయ రిసోర్స్ పర్సన్ డాన్‌బాస్కో వివరించారు. ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో నాలుగు రోజులు కొనసాగిన జిల్లా స్థాయి ఆర్పీల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. 8రకాల పుస్తకాలపై శిక్షణ ఇచ్చారు.సంఘాల నమోదు, తీర్మానాలు, సాధారణ పుస్తకాలు, అప్పుల పుస్తకాలు, ఉపపుస్తకాలు, ఆడిట్ స్టేట్‌మెంట్, రశీదులు, ఓచర్లు నమోదుపై తీరి, ప్రాక్టికల్ క్లాస్‌లు బోధించారు. రికార్డులు రాయకపోవటం వల్ల జరిగే ఆర్థిక ఇబ్బందులు, వివాదాలపై వివరించారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా, మధిర మున్సిపాలిటీల్లోని రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు. డీఎంసీ సావల సుజాత, ఏడీఎంసీ వెంకటేశ్వరరావు, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, గొప్పోజు ఉపేంద్రమ్మ, సీవోలు సల్మా, చిలకా ద్రౌపది, బొల్లికొండ రోజా పర్యవేక్షణ చేశారు.



తరగతులు బోధిస్తున్న జాతీయ రిసోర్స్ పర్సన్ డాన్‌బాస్కో

ఏపీఎంలపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్డి నిర్మాణ పేరుతో గ్రామ సమైక్యాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా రూ. 36 వేలు వసూలు చేసిన ఏపీఎంపై తగిన చర్యలు తీసుకోవాలని గురువారం కల్లూరు మండలంలోని పలువురు వివోఏలు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు కల్లూరులో జరిగిన ప్రజా వాణిలో అక్రమంగా వివోఏల నుంచి ఏపీఎం రాంబాబు నగుదు వసూలు చేస్తున్న విషయమై సిపిఐ, సిఐటియూ తరుపున సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దృష్టికి తీసుకోరాగా స్పందించిన ఎమ్మెల్యే సదరు మరుగుదొడ్డిని ప్రభుత్వమే నిర్మిస్తుందిని చెప్పిన అందుకు భిన్నంగా సదరు ఏపిఎం విరుద్ధంగా వ్యవహరించారని వారు ఆరోపించారు.

వైభవంగా మంత్రి పొంగులేటి గృహప్రవేశం



గృహప్రవేశ పూజల్లో కుటుంబ సభ్యులతో పొంగులేటి

కల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండంలోని నారాయణపురంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమం గురువారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పావన కార్యక్రమంలో మంత్రి సతీమణి మాధురి, సోదరుడు ప్రసాదరెడ్డి, శ్రీలక్ష్మి దంపతలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పలకలు, స్నాక్స్ పంపిణీ

సత్తుపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక సిద్దారం రోడ్డులోని స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం స్లేట్స్, స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.చక్రపాణి మాట్లాడుతూ.. తోటివారికి సాయం చెయ్యాలనే ఆలోచన చాలా గొప్పదని, పిల్లలు మంచిగా చదివి ప్రయోజకులై పేదవారిని అన్నివిధాల ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వలపర్ల రవి కుమార్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్యవైశ్య కల్యాణ మండప అధ్యక్షుడిగా కృష్ణార్జునరావు

కల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మండల మహాసభ సంఘం నాయకులు అచ్యుతా సీతారామారావు, కొప్పురావూరి అంజనేయులు సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. కళ్యాణ మండపం అధ్యక్షుడిగా దోసపాటి కృష్ణార్జునరావు, కార్యదర్శిగా దారా శ్రీనివాసరావు, కోశాధికారిగా సముద్రాల పుల్లారావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎవరికి వారే యమునా తీరే!

- వైరా అధికార పార్టీ శ్రేణుల మధ్య ఆధిపత్యపోరు
- పైచేయి సాధించేందుకు భట్టి, పొంగులేటి వర్గాల సై
- 'స్థానిక' పోరు సమీపిస్తున్న వేళ ఢీ అంటే ఢీ



వైరా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైరా అసెంబ్లీ నియోజకవర్గంలో.. మరీ ముఖ్యంగా మునిసిపాలిటీలోని అధికార పార్టీలో ఆధిపత్యం పోరు జరుగుతోంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గాలుగా విడిపోయిన నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా.. ఒకరిపైఒకరు పైచేయి సాధించేందుకు సై అంటే సై అంటున్నారు. 2014 ఎన్నికలు మొదలుకొని 2018, 2023 ఎన్నికలను వైరాలో పొంగులేటి వర్గం చాలావరకు ప్రభావితం చేసింది. అయితే ఇప్పుడు పొంగులేటి వర్గం ఆధిపత్యాన్ని తగ్గించి మునిసిపాలిటీలో పాగా వేసేందుకు భట్టి వర్గం కొద్దిరోజుల నుంచి కసరత్తు చేస్తోంది. ఈ తరుణంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పరిస్థితి ఇరకాటంలో పడిందని తెలుస్తోంది. ఇప్పటికే వైరా రాజకీయాలపై భట్టి విక్రమార్క తన ముద్ర వేసుకున్నారు. తన ప్రధాన అనుచరుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. తన వర్గానికి చెందిన నాయుడు సత్యనారాయణకు హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్, నూతి సత్యనారాయణకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టారు. ఇక వైరాలో క్రియాశీలకంగా ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరుడు రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ అయిన బొర్రా రాజశేఖర్ ఇంకా పదవి కోసం ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో వైరా మండలానికి చెందిన బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగాన్ని సిద్ధం చేసుకున్నారు. బీఆర్ఎస్‌లో ఉన్న తన అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తూ కాంగ్రెస్‌లో చేరాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. వారిలో వైరా మునిసిపాలిటీలో గత పాలకవర్గంలో పనిచేసిన ముగ్గురు కౌన్సిలర్లు కూడా కాంగ్రెస్ నుంచి గట్టి హామీ లభిస్తే కొండబాలతోపాటు చేరేందుకు సుముఖంగా ఉన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ కౌన్సిలర్లను కాంగ్రెస్‌లో చేర్చుకుని త్వరలో జరిగే మునిసిపల్ ఎన్నికల్లో తమ వర్గం నుంచి వారికే టిక్కెట్లు ఇచ్చి ఎక్కువ మంది కౌన్సిలర్లను గెలుచుకొని మునిసిపాలిటీని హస్తగతం చేసుకోవాలని భట్టి వర్గం కొద్దిరోజులుగా పావులు కదుపుతోంది. ఇప్పటికే పొంగులేటి వర్గానికి చెందిన కొందరు నాయకులను విడివిడిగా పిలిచి భట్టి వర్గం నాయకులు మంతనాలు చేస్తున్నారు. తమ వెంట రావాలని భట్టి వర్గీయులు కోరుతుండగా.. పొంగులేటి వర్గీయులు మాత్రం ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించకుండా దాటవేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మునిసిపాలిటీలో 20వార్డులు ఉన్నాయి. పాలకవర్గ ఏర్పాటుకు 11మంది కౌన్సిలర్ల అవసరం. ఈ మునిసిపాలిటీలో పొంగులేటి వర్గం కూడా బలంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఆ వర్గంలోని కొందరు జనాకర్షణ ఉన్న నాయకులను తమ వర్గంలోకి లాగేందుకు భట్టి వర్గీయులు పావులు కదుపుతున్నారు. వైరాలో మంత్రులు, ఎమ్మెల్యే, పార్టీ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో అన్నివర్గాల నాయకులు కలిసి పాల్గొంటున్నారు. అయితే ఎవరికివారే తమ వర్గాన్ని బలోపేతం చేసుకొనేందుకు మరోవైపు ప్రయత్నాలు చేస్తున్నారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి వర్గీయుడిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు ఉన్నారు. ప్రస్తుతం ఆయన తన వర్గీయులతో భట్టి, పొంగులేటి వర్గీయులతో కలిసి ఉంటూనే తటస్థంగా వ్యవహరిస్తున్నారు. వైరా అధికార కాంగ్రెస్‌లో రాబోయే మునిసిపల్ ఎన్నికలకు ఇప్పటినుంచే ఎత్తులు పైఎత్తులు వేసుకుంటూ పాలకవర్గాన్ని చేజిక్కించుకొనేందుకు లోపాయికారీగా పావులు కదుపుతున్నారు. ఇది వైరాలో సర్వత్రా చర్చనీయాంశమైంది.



ఎంపీడీవోను సన్మానించిన ఎమ్మెల్యే

వైరా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన వైరా ఎంపీడీవో పిల్లి సరస్వతీ, గన్నవరం కార్యదర్శి చిట్టిమోతు వెంకటేశ్వర్లును వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక సాయి బాబా కల్యాణ మండపంలో మండలపరిషత్, ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో వైరా మండల ప్రత్యేక అధికారి కస్తాల సత్యనారాయణ అధ్యక్షతన వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సుదీర్ఘకాలం ఉద్యోగ నిర్వహణలో ప్రజలకు సేవలందించిన సరస్వతీ, వెంకటేశ్వర్లు భవిష్యత్‌లో కూడా వారికి నచ్చిన రంగంలో సేవ చేస్తూ భావిజీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. జడ్పీ సీఈవో దీక్షా రైనా, వైరా సొసైటీ ఛైర్మన్ రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు పాల్గొన్నారు.

ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి: ఎంఈవో



ప్రోత్సాహకాలు, బహుమతులతో విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బిగ్ హెల్ప్ సంస్థ అందిస్తున్న ప్రోత్సాహం ద్వారా ఎంచుకున్న లక్ష్యాన్ని విద్యార్థులు చేరుకోవాలని ఎంఈవో నక్కా రాజేశ్వరరావు కోరారు. గురువారం పాతసెంటర్‌లో జడ్పీహెచ్ఎస్‌లో బిగ్ హెల్ప్ డే సందర్భంగా ప్రతిభ కనబరుస్తున్న 6-10వ తరగతులకు చెందిన 20మంది విద్యార్థులకు ఆర్థిక సహాయంతోపాటు ప్రథమ, ద్వితీయ బహుమతులను పంపిణీ చేశారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థానానికి ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని, మంచి భవిష్యత్తు సాధించాలని కోరారు. ఉత్తమ ప్రతిభతో గురువులు, తల్లీదండ్రులకు మంచి పేరు తేవాలని, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.శైలకుమారి, పీడీ టీ.ప్రసాద్, ఏడీ వేము రత్నాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, బిగ్ హెల్ప్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన ఎంఈవో

ఏన్కూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు గురుకుల పాఠశాలను గురువారం ఎంఈవో రహీంబీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించారు. తరగతి గదులను, వంటగదులను, భోజనశాల, డార్మెటరీ, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్‌లను, పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను, స్నానాల గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏటీపీ వేము రాజు, సీఆర్పీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

సంక్షేమం కల్పనలో కాంగ్రెస్ ముందంజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో సంక్షేమ పథకాలను నిరుపేదలకు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. గురువారం వైరా రైతువేదికలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు, రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పరితపిస్తుందన్నారు. సంక్షేమ పథకాల చెక్కులను లబ్ధిదారులకు అందించడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వం విస్మరించిన ప్రజా సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందని వివరించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఘనవిజయానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, తహసీల్దార్ కేవీ. శ్రీనివాసరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ నాయకులు పొదిల హరినాథ్, బొళ్ల గంగారావు, పమ్మి అశోక్, దార్న రాజశేఖర్, పణితి శ్రీను, వీరంశెట్టి సీతరాములు, కట్ల నాగరాజు, కట్ల సంతోష్, షేక్. సైదా, యన్నం వెంకటకోటిరెడ్డి, భూక్యా రాముడు, పమ్మి వెంకయ్య పాల్గొన్నారు.

'ఇళ్ల' బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

- పట్టించుకోని అధికారులు





పునాది దగ్గర వేముల చిన్నమ్మ, బిల్లులు అందలేదంటున్న లబ్ధిదారులు

కల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మునిసిపాలిటీ పరిధిలో గల పలు గ్రామాల్లో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల మంజూరు పత్రాల, ఆధార్‌కార్డుల పేర్లలో తేడా ఉండటంతో ప్రభుత్వం తరుపున బిల్లులు సకాలంలో అందడంలేదని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పునాది స్థాయిలో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు మొదటి విడతగా బిల్లు రూ.1 లక్ష అందాల్సి ఉంది. కానీ ఆధార్‌కార్డ్, మంజూరు పత్రాల్లో చిన్నపాటి తప్పిదంతో సాంకేతిక సమస్య ఏర్పడి మొదటి విడతగా బిల్లు అందక నానా అవస్థలు పడుతున్నారు. అందుకు నిదర్శంగా కల్లూరు పట్టణం, వాచ్యానాయక్‌తండ తదితర ప్రాంతాల్లో ఇందిరమ్మ గృహాలను పూనాదిస్థాయిలో నిర్మించుకోగా నెలరోజులు గడిచిన తమకు బిల్లు అందలేదని రామానగర్‌కు చెందిన లబ్ధిదారురాలు. వేముల చిన్నమ్మ ఆంధ్రజ్యోతితో తన ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ పరంగా తమకు ఇందిరమ్మ గృహం మంజూరైందని ఎంతో ఆశతో సిమెంట్, స్టీల్, కాంక్రిట్, ఇసుక కూలీల కోసం రూ.2 లక్షలు అప్పుగా చేశామని తెలిపింది. బిల్లుల కోసం ఎంపీడీవో, మునిసిపాలిటీ కార్యాలయాల చుట్టు తిరుగుతున్న అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. మంజూరు పత్రాలు, ఆధార్‌కార్డుల్లో పేర్లు సరిపోలక పోవటంతో (ఆన్‌లైన్ అప్డేట్ కాక) బిల్లులు అందని విషయంపై, సదరు లబ్ధిదారుల పేర్ల జాబితాను సవరణ కోసం మునిసిపాలిటీ కార్యాలయం తరుపున జిల్లా గృహనిర్మాణ శాఖ వారికి పంపడం జరిగిందని సదరు అధికారి ఒకరు చెప్పారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో పలువురు లబ్ధిదారులు గృహాల నిర్మాణం పనులు చేపట్టేందుకు ముగ్గులు వేయగా క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తున్న సిబ్బంది, అధికారులు కూడ మంజూరు పత్రాల్లో, ఆధార్ కార్డుల్లో పేర్లు తేడాతో అభ్యంతరం తెలుపుతూ వాటి నిర్మాణాలు జరగకుండ ఆపివేస్తున్నట్లు పలువురు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.తాము గృహాల నిర్మాణంలో వినియోగించే సిమెంట్, ఇసుక స్టీల్ వర్షానికి తడసి పనికిరాకుండాపోతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు స్పందించి మంజూరు పత్రాలు, ఆధార్‌కార్డుల్లో లబ్ధిదారుల పేర్లలో ఒకేలా ఉండేలా సవరణ చేస్తూ బిల్లులను సత్వరమే అందించాలని పలువురు కోరుతున్నారు.

ఇందిరమ్మ గ్రామ కమిటీలు
రద్దు చేసే వరకు పోరాడతాం

బోనకల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మధిర డివిజన్ కారదర్శి మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ లబ్దిదారులను ఎంపిక చేసేందుకు ఇందిరమ్మ గ్రామ కమిటీలకు ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించారు. గ్రామసభల నిర్వహణ ద్వార అధికారుల సమక్షంలో ఎంపికలు చేయాలని లేని పక్షంలో డిప్యూటీ సీఎం భట్టీ కార్యక్రమాలను కూడ అడ్డుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరికి ఇచ్చే నిధులు కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆస్తులు అమ్మి ఇస్తున్నారా? లేదా ప్రభుత్వానివా? చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికే ఇళ్లు ఇస్తున్నారని, ప్రభుత్వమంటే కేవలం ఆ పార్టీయేనా? అని ప్రశ్నించారు. దివ్యాంగులు, వితంతువులు, పూరి గుడిసెల్లో నివాసం ఉన్న వారికి ఇళ్లు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రమాదేవికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం డివిజన్, మండల నాయకులు పాపినేని రాంనర్సయ్య, దొండపాటి నాగేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, తుళ్లూరు రమేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, సునిత, ఉమ, వాణి, ముత్తారావు, నరేష్, తిరుపతిరావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అమలు చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

బోనకల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జాప్యం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. మండలంలోని రాపల్లి గ్రామంలో గురువారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ పార్టీతో కాంగ్రెస్ పొత్తు ఉన్నందున స్థానిక ఎన్నికల్లో కూడా ఇదే మిత్ర ధర్మాన్ని పాటించాలని కోరారు. ఇందుకు విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తే పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. మహాలక్ష్మీ పథకం అమలులో భాగంగా మహిళల ఖాతాల్లో నెలకు రూ. 2500 జమ చేయాలని కోరారు.

'వెంకట్రావును విమర్శిస్తే ఊరుకునేది లేదు'

ఏన్కూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆదివాసం సంక్షేమ పరిషత్ జిల్లానాయకుడు వర్సా నాగరాజు హెచ్చరించారు. గురువారం స్థానిక కొమరం భీమం విగ్రహం వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షెడ్యూల్ తెగ(ఎస్టీ) మోదాపై తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టునుఆశ్రయించారనే అక్కసుతోనే సేవాలాల్ సేన నాయకులు అనుచిత వ్యాక్యలు చేస్తున్నారని ఆరోపించారు. అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. సీతక్కకు మంత్రి పదవి రావడం సేవాలాల్ సేన నాయకులకు మింగుడు పడడంలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ముక్తి వెంకటేశ్వర్లు, నాచారం మాజీ సర్పంచ్ వర్సా రాంబాబు, గంగులనాచారం మాజీ సర్పంచ్ వర్సా మల్లేష్, ఆదివాసీ నాయకులు బండ వెంకటేశ్వర్లు, సున్నం నర్సింహారావు, బండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

కారేపల్లి జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లిలో ఉన్న ఏకలవ్య పాఠశాలలను గురువారం ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్ తనిఖీచేశారు.ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తరగతి గదులు, వంట రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులకు ప్రతిరోజు నాణ్యతతో కూడిన భోజనం పెడుతున్నారా అని అడిగి తెలసుకున్నారు. పరిసరా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రశాంత్,వైస్ ప్రిన్సిపాల్ హరిష్ రంజిత్, ఆర్‌డబ్లూఎస్ ఏఈ నరేందర్,పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ

చింతకాని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ఆత్మ కమిటీ జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల గోవిందరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్ కార్డు మంజూరి పత్రాలను ఆయన అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం రేషన్ కార్డులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, మాజీ సర్పంచ్ గొడుగు రమేష్, శ్రీరాముల నాగేశ్వరరావు, యలమద్ది రాంబాబు, మేకపోతుల పవన్ పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయ రుణాల పంపిణీ

మధిరరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దినేనిగూడెం సహకార సంఘం పరిధిలోని రైతులకు కొత్తగా మంజూరైన పంటరుణాలను గురువారం అందజేశారు. మధిరలోని కోపరేటివ్ బ్యాంకు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ కటికల సీతరామిరెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ గోపిరెడ్డి చేతులమీదుగా రైతులకు రుణాలను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శాంతి, సీఈవో కృష్ణారెడ్డి, సిబ్బంది విజయ, యశ్విని పాల్గొన్నారు.

పులిగుండాలను సందర్శించిన అధికారులు

పెనుబల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రంగా పులిగుండాలను అభివృద్ధి పర్చాలని ప్రభుత్వం నిర్ణయించిన విధంగా నిధులు కేటాయించడంతో అక్కడ పర్యాటలకులకు సంబంధించి వసతి ఏర్పాట్లను ట్రైబల్ వెల్ఫేర్ క్యాంపు డీడీ ఎల్.రాములు, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ యశ్వంత్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పులిగుండాల ప్రాజెక్టు ప్రాంతంలో పర్యాటకులకు కల్పించాల్సిన వసతి భవనాలకు సంబంధించి స్థలాలను పరిశీలించారు. బ్రహ్మళకుంట బీట్ ఆఫీసర్ భరత్‌కుమార్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లింగన్న స్ఫూర్తితో ఉద్యమించాలి: షేక్ ఖాసీం

కొణిజర్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పూనెం లింగయ్య స్ఫూర్తితో మరో భూపోరాట ఉద్యమాలు నిర్మించాలని, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ వైరా సబ్‌డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీం పిలుపునిచ్చారు. గురువారం కొణిజర్లలో జరిగిన లింగన్న ఆరోవర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుండాల మండలంలో లింగన్నను ఆనాటి ప్రభుత్వం కిరాతకంగా బూటకపు ఎన్‌కౌంటర్ పేరిట కాల్చిచంపిందని ఆవేదన వ్యక్తం చేశాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, పటాన్‌ఖాసీంఖాన్, ఉపేందర్, భాష, కృష్ణ, గంగయ్య, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ద్వారకాపూరి కాలనీ సమీపంలోని సత్తుపల్లి మెయిన్ రోడ్ డివైడర్‌పై విరిగిన విద్యుత్ స్తంభాన్ని మార్చనుండగా నేడు ద్వారకాపూరి కాలనీ, గాంధీనగర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ యు.శరత్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా కంటి ఆసుపత్రి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పని నిమిత్తం ఆసుపత్రి వీధితోపాటు పరిసర ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం ఏర్పడనుండగా సహకరించాలని కోరారు.

సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ఏన్కూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నూతనంగా నియమితులైన శిక్షణ ఉపాధ్యాయులకు సైన్స్ ప్రయోగాలపై రిసోర్స్ పర్సన్ సాగి సుజాత అవగాహన కలిగించారు. గురువారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 3 మండలాల స్థాయి జీవశాస్త్ర, టీసీ కాంప్లెక్స్ తరగతులు నిర్వహించారు. అనంతరం ఆమె విద్యాప్రమాణాలు, అభ్యాసన, సామర్థ్యాలపై అవగాహన కలిగించారు. టీఏల్ఎం తరగతి గదిలో తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. ఖాన్ అకాడమి ద్వారా విద్యాబోధన చేయాలనిసూచించారు .

సోమవరంలో పీహెచ్‌సీ ప్రారంభం

వైరా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైరాలోని సోమవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి గురువారం ప్రారంభించారు. వైరాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవరంకు మార్చారు. వైరాలోని పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని పూర్తిస్థాయి వైద్య విధానపరిషత్ ఆసుపత్రి నిర్వహణకు కేటాయించారు. వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష, హెచ్‌ఈవో జాన్సన్, నర్సింహారావు, హెచ్‌ఎస్ అనంతరాములు, ఏసుమణి, రాజ్యలక్ష్మీ, డీపీఎంవో శాస్త్రీ, నాగమణి, రజియా పాల్గొన్నారు.

యూరియాపై విస్తృతస్థాయి అవగాహన కార్యక్రమాలు

- పీఏసీఎస్‌లకు చేరిన 80 మెట్రిక్ టన్నుల యూరియా



గంగదేవిపాడు సొసైటీలో రైతులతో మాట్లాడుతున్న డీఏవో పుల్లయ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిధిలోని పలు ప్రాథమిక సహకార సంఘాలకు గురువారం జిల్లా వ్యవసాయశాఖ తరుపున 80 మెట్రిక్ టన్నుల యూరియాను చేరవేశారు. యూరియా కోసం ఈ ప్రాంతానికి చెందిన రైతులు ఇబ్బందులు పడుతన్న విషయమై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ అనుదీప్ స్పదించారు. పిఏసిఎస్‌ల వద్ద యూరియా కోసం రైతులు బారులు ఉండకూడదని అవసరమైన మేరకు కల్లూరు మండలానికి యూరియాను సత్వరమే అందించాలని జిల్లా డిఏఓను ఆదేశించారని తెలిసింది. ఈ సందర్భంగా కల్లూరు, చెన్నూరు పిఏసిఎస్‌ల్లో, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా స్టాక్ బోర్డులను, నిల్వలను డిఏఓ పుల్లయ్య సందర్శించి పరిశీలించారు. ఏఓ ఎం రూప ఏఈఓ పాల్గొన్నారు.

తల్లాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా సరిపడా యూరియా సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. గురువారం మండలంలోని తల్లాడ, గంగదేవిపాడు సొసైటీ కార్యాలయాలను ఆయన సందర్శించారు. మండల ఏవో ఎండీ తాజుద్దీన్, ఏఈవోలు హసీనా, మాధవి, మురళి, శివకుమార్, సాయి, సొసైటీ సీఈవోలు నాగబాబు, రాకేష్‌రాజులు పాల్గొన్నారు.

పెనుబల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగదేవిపాడు, ఎడ్లబంజర్ గ్రామాల్లో నానోయూరియా, డీఏపీ వాడకంపై ఏవో ఏవీఎస్. ప్రసాదరాజు రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నానోయూరియాను 500మిల్లీలీటర్ల బాటిల్‌కు ఒక ఎకరాకు ఒక బస్తా యూరియాను ప్రత్యామ్నాయంగా వాడితే సత్ఫలితాలు పొందవచ్చునని సూచించారు. నానోయూరియాను పైపాటుగా మొక్కపై పిచికారి చేసినప్పుడు 90నుంచి95శాతం పోషక వినియోగ సామర్థ్యంతో నత్రజని మొక్కకు అందుతుందని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో మొక్కకు కావల్సిన పోషకాన్ని సమర్థవంతంగా అందించేందుకు నేల, గాలి, కాలుష్యంను నివారించవచ్చునని తెలిపారు. ఏఈవోలు జి.నాగరాజు, లక్ష్మీభవాని, రైతులు పాల్గొన్నారు.

వైరా, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైరా మండలం వల్లాపురం గ్రామంలో నానోయూరియా, నానో డీఏపీ వినియోగం గురించి గురువారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మయాన్ మంజూఖాన్ రైతులకు నానోయూరియా, నానోడీఏపీ గురించి వివరించారు. సాధారణ యూరియా కంటే ఇది అధిక పోషకాలు ఇస్తుందని వీటిని ఉపయోగించటం వలన రైతులకు ఖర్చు తగ్గుతుందని, ఎరువు పూర్తిస్థాయిలో మొక్కకు అందుతుందని వివరించారు. ఏఈవో వాసంతి, రైతులు రాణాప్రతాప్, శ్రీనివాసరావు, నాగయ్య పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఎరువుల విక్రయాలు జరపకూడదు

ముదిగొండ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఫెర్టిలైజర్స్ విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో సరిత, ముదిగొండ ఎస్ఐ హరిత హెచ్చరించారు. గురువారం తనిఖీలు నిర్మహించారు.

రాకేష్‌కు సండ్ర నివాళి



రాకేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సండ్ర

తల్లాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): షటిల్ ఆడుతూ ఆకస్మికంగా గుండెపోటుతో మృతిచెందిన గుండ్ల రాకేష్‌కు గురువారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాకేష్ తండ్రి మాజీ ఉపసర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు దంపతులను ఓదార్చారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు దగ్గుల శ్రీనివాసరెడ్డి, వజ్రాల రామిరెడ్డి, పెరికే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఇళ్ల' పేరుతో మట్టిని అమ్ముకుంటే చర్యలు

కారేపల్లి జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పేరు చెప్పి ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టితోలకాలు చేపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనుంతుల రమేష్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ.. 41 గ్రామపంచాతీలలో వందలాది ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నాయని, వారికి అవసరమైన మట్టిని వారు సంబంధిత అధికారుల వద్ద పర్మిషన్ తీసుకుని తోలుకోవాలన్నారు. చాలమంది ఏలాంటి అనుమతులు లేకుండ లబ్ధిదారుల నుంచి అధికమొత్తంలో డబ్బులు వసుళ్లాకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికివచ్చిందన్నారు. అనుమతులు లేకుండ తోలకాలు చేయవద్దన్నారు.